RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

ప్రచురణ: తిరుపతి | సంపుటి:3 | సంచిక : 226 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | సోమవారం 13 జులై 2026 | పేజీలు: 8 | వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

రథోత్సవానికి పటిష్ట పోలీసు బందోబస్తు



వివరాలు 3లో


**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

## వియత్నాం బోటు ప్రమాదంలో మృతదేహాల తరలింపు

# వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం



- వియత్నాం బోటు ప్రమాదంలో ముగ్గురు ఏపీ వాసుల మృతి
- మృతదేహాల తరలింపునకు తక్షణ ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడి
- మృతుల తరలింపునకు భారత రాయబార కార్యాలయం ఏజెన్సీ ఏర్పాటు
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రులు లోకేశ్, అనిత, ఆర్టీజీఎస్

అమరావతి (సింధూర దర్శిని) 12 జూలై వియత్నాంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మరణించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురి మృతదేహాలను స్వస్థలాలకు తరలించేందుకు తక్షణమే ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వియత్నాం ప్రమాద బాధితులకు అందిస్తున్న సహాయంపై ఆయన నేడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. మృతుల కుటుంబాలకు అండగా నిలవాలని, తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. వియత్నాంలోని ఫు క్వోక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఓ ప్రముఖ మొబైల్ ఫోన్ కంపెనీ తమ డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన విహారయాత్రలో ఈ విషాదం చోటుచేసుకుంది. పడవలో మొత్తం 32 మంది ప్రయాణిస్తుండగా, 15 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉన్నారు. ఇదే ప్రమాదంలో గాయపడిన గెల్లే కిశోర్ అనే మరో ఏపీ వ్యక్తి ప్రస్తుతం వియత్నాంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని అధికారులు సీఎంకు వివరించారు. మృతుల భౌతికకాయాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ఒక ఏజెన్సీని నియమించిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. మృతదేహాల అప్పగింత, తరలింపు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వివరించారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన వారిని ఆదివారం విమానాల్లో స్వస్థలాలకు పంపేందుకు ఏర్పాట్లు చేశామని, వారికి సంబంధిత మొబైల్ కంపెనీ విమాన టిక్కెట్లు సమకూర్చిందని వెల్లడించారు. బాధితులు సురక్షితంగా దేశానికి తిరిగి

మిగతా 2లో...

## ‘ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది.. ఇప్పుడు మూల్యం చెల్లిస్తోంది’

- అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్



- హార్మూజ్ జలసంధిలో సైప్రస్ వాణిజ్య నౌకపై ఇరాన్ బలగాల దాడి
- ప్రతిగా ఒకే వారంలో మూడోసారి అమెరికా భీకర వైమానిక దాడులు
- ‘హార్మూజ్’ను నిరవధికంగా మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన
- అమెరికా మరిన్ని దాడులు చేస్తే ప్రాంతీయ స్థావరాలపై దాడి చేస్తామని హెచ్చరిక

**అమెరికా:** అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన సముద్ర రవాణా మార్గం ‘హర్మూజ్ జలసంధి’ వేదికగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ‘హర్మూజ్’ గుండా సైప్రస్ జెండాతో వెళ్తున్న ‘ఎం/వి జీఎఫ్ఎస్ గెలాక్సీ’ అనే వాణిజ్య కంటైనర్ నౌకపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) బలగాలు దాడి చేయడంపై అమెరికా తీవ్రంగా స్పందించింది. ఇరాన్ చర్యకు ప్రతికారంగా అమెరికా మిలటరీ శనివారం ఇరాన్‌పై భీకర వైమానిక దాడులకు దిగింది. ఒకే వారంలో ఇరాన్ లక్ష్యాలపై అమెరికా దాడులు చేయడం ఇది మూడోసారి. ఈ దాడులను ధ్రువీకరిస్తూ అమెరికా సెంట్రల్ కమాండ్ విడుదల చేసిన అధికారిక ప్రకటనను అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ఎక్స్ వేదికగా రీషేర్ చేశారు. ఇరాన్‌ను తీవ్రంగా హెచ్చరిస్తూ.. “ఇరాన్ చాలా తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు దానికి తగిన మూల్యం చెల్లించుకుంటోంది” అని ఆయన రాసుకొచ్చారు. అమెరికా మిలటరీ సమాచారం ప్రకారం.. శనివారం రాత్రి 7:15 గంటలకు సెంట్‌కామ్ దళాలు ఇరాన్‌పై దాడులు ప్రారంభించాయి. అంతకుముందు ఇరాన్ బలగాలు అంతర్జాతీయ జలమార్గ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాణిజ్య నౌకపై దాడికి తెగబడ్డాయి. అయితే, దీనిపై ఇరాన్ ఐఆర్‌జీసీ నేవీ స్పందిస్తూ.. సదరు కంటైనర్ నౌక అనుమతి లేని మార్గంలో ప్రయాణించిందని, తమ హెచ్చరికలను పదే పదే నిర్లక్ష్యం చేయడం వల్లే తాము దానిని అడ్డుకుని దాడి చేయాల్సి వచ్చిందని సమర్థించుకుంది. మరోవైపు, అంతర్జాతీయ

మిగతా 2లో...

# విద్యార్థులకు సీఎం విజయ్ సత్కారం

- టీవీకే పార్టీ ఆధ్వర్యంలో విద్యా పురస్కారాల ప్రదానం
- 10, 12వ తరగతి టాపర్లను సత్కరించనున్న సీఎం విజయ్
- ప్రతి నియోజకవర్గంలోని ముగ్గురు టాపర్లకు బంగారు పతకాలు
- ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారిగా కార్యక్రమం నిర్వహణ
- ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదని, పార్టీదేనని స్పష్టత



**చెన్నై:** తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ అధినేత, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ తన పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే విద్యా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించనున్నారు. 10, 12వ తరగతి స్టేట్ బోర్డ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన స్వయంగా సత్కరించనున్నారు. ఈ నెలాఖరున లేదా ఆగస్టు మొదటి వారంలో చెన్నై వేదికగా ఈ భారీ కార్యక్రమం జరగనుంది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ అవార్డుల ప్రదానోత్సవం జరగడం ఇదే తొలిసారి. 2023లో టీవీకే పార్టీ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివి, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి

మిగతా 2లో...

## విశాఖకు జగన్.. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్న వైసీపీ అధినేత



- ఈ నెల 14న విశాఖకు వెళ్లనున్న జగన్
- బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు పరామర్శ
- ప్రభుత్వ వైఫల్యంపై తీవ్రస్థాయిలో మండిపడ్డ వైసీపీ నేతలు
- సీఎం, డిప్యూటీ సీఎం మౌనంపై వైసీపీ విమర్శలు
- ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారుడితోనూ జగన్ భేటీ

అమరావతి (సింధూర దర్శిని) 12 జూలై వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన జగన్ పర్యటన ఖరారైంది. ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు. ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకా రులు గల్లంతయ్యారని అన్నారు. గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సీఎం

మిగతా 2లో...

# పవన్ రెండో భుజానికి కూడా సమస్య ఉందని వైద్యులు చెప్పారు: చంద్రబాబు

- ముంబై ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు
- భుజానికి మూడున్నర గంటల పాటు ఆపరేషన్ జరిగిందని వెల్లడి
- పవన్‌కు మూడు వారాల పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు
- ప్రజల మధ్యలో ఉన్నప్పుడు ఒత్తిడి కారణంగానే పవన్‌కు గాయమైందని వెల్లడి



ముంబై (సింధూర దర్శిని) 12 జూలై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిం దని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఆదివారం ఆయన ముంబై వెళ్లి ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవన్ ఆరోగ్య పరిస్థితిని, వైద్యుల సూచనలను వివరించారు.

### అభిమానుల తాకిడి వల్లే సమస్య

పవన్ కల్యాణ్ ఎప్పుడూ ప్రజల సేవలోనే ఉంటారని, వారి మధ్యకు వెళ్లినప్పుడు తనను తాను మరిచిపోతారని చంద్రబాబు అన్నారు. “పవన్ ఎక్కడికి వెళ్లినా పెద్ద సంఖ్యలో జనం వస్తారు. ఆ సమయంలో తోపులాట, ఒత్తిడి సర్వసాధారణం. ఈ ఒత్తిడి కారణంగానే ఆయన భుజానికి సమస్య వచ్చింది. ఇది ఈరోజు వచ్చింది కాదు, చాలా కాలంగా ఈ నొప్పితో బాధపడుతున్నారు. చివరకు ఇక్కడికి వచ్చి అత్యుత్తమ వైద్యుల చేత ఆపరేషన్ చేయించుకున్నారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ ఆపరేషన్ జరిగింది” అని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం పవన్ వేగంగా కోలుకుంటున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యవంతులవుతారనే విశ్వాసం ఉందని చెప్పారు. వైద్యుల సూచన మేరకు పవన్ కల్యాణ్‌కు మూడు వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆ తర్వాత ఫిజియోథెరపీ చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. “పవన్ రెండో భుజానికి కూడా కొంచెం సమస్య ఉంది. దానికి ప్రస్తుతానికి ఫిజియోథెరపీ, వ్యాయామాలు చేయాలని వైద్యులు సూచించారు. ఆరు నెలల తర్వాత పరిస్థితిని సమీక్షించి, అవసరమైతే తదుపరి చర్యలు తీసుకుంటారు” అని చంద్రబాబు వెల్లడించారు.

### జాతీయ అంశాలపై స్పందన

ఈ సందర్భంగా చంద్రబాబు పలు జాతీయ అంశాలపై కూడా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. “ప్రధాని మోదీ వల్ల ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గౌరవం పెరిగింది. ఆయన కేవలం భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే శక్తివంతమైన

మిగతా 2లో...

## వియత్నాం బోటు ప్రమాదం.. మృతదేహాల తరలింపు వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే వరకు, మృతదేహాల తరలింపు పూర్తయ్యేంత వరకు అవసరమైన అన్ని సహాయక చర్యలు అందించాలని న్యూఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ దుర్ఘటనపై ఏపీ ప్రభుత్వం వేగంగా స్పందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే మంత్రి లోకేశ్ వియత్నాంలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి, సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. సహాయక, పునరావాస కార్యక్రమాలను సమన్వయం చేసే బాధ్యతను రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)కి అప్పగించారు.
ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ 24 గంటలూ పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, ఏపీ భవన్, ఏపీఎన్ఆర్టీ సొసైటీలతో ఆర్టీజీఎస్ అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధితుల కుటుంబాలకు సత్వర సహాయం అందేలా చూస్తున్నారు.

## విశాఖకు జగన్.. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్న వైసీపీ అధినేత

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు. జూలై 4న గంగవరం తీరానికి 10 నాటికల్ మైళ్ల దూరంలో ఏడుగురు మత్స్యకారులతో వెళ్లిన మర పడవ బోల్తా పడిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా, ఆరుగురి ఆచూకీ లభించలేదు. నాలుగు రోజుల పాటు నేవీ, కోస్ట్ గార్డ్ గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఆపరేషన్‌ను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం గల్లంతైన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

## పవన్ రెండో భుజానికి కూడా సమస్య ఉందని వైద్యులు చెప్పారు: చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

నాయకుడు. నేడు ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటే, భారతదేశం మాత్రం స్థిరంగా అధిక వృద్ధి రేటును సాధిస్తోంది. దీనికి కారణం మోదీ నాయకత్వమే. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం వల్లే ఇది సాధ్యమవుతోంది. ఆయన నాయకత్వంలో 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనే పూర్తి విశ్వాసం నాకుంది" అని చంద్రబాబు అన్నారు. వియత్నాం పడవ ప్రమాదంపై మాట్లాడుతూ.. అది చాలా దురదృష్టకరమైన సంఘటన అని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. మృతదేహాలను వెనక్కి తీసుకువస్తున్నామని, అక్కడున్న వారిని సురక్షితంగా వెనక్కి పంపే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇక ఉత్తరప్రదేశ్ లో అయోధ్య ఘటనపై మాట్లాడుతూ.. ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, విచారణ జరుగుతున్నందున కొంత సమయం వేచి చూడాలన్నారు. పశ్చిమ బెంగాల్‌లో యూసీసీ కమిటీ ఏర్పాటును స్వాగతిస్తూ.. ఒకప్పుడు 'బెంగాల్ ఈరోజు ఆలోచించింది, దేశం రేపు ఆలోచిస్తుంది' అనే వారని, మధ్యలో ఆగిపోయిన ఆలోచన ఇప్పుడు మళ్లీ మొదలైందని, బెంగాల్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి అడిగిన ప్రశ్నకు, నాయకుల పనితీరును బట్టే ప్రజలు అంచనా వేస్తారని, సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా ఉన్నప్పుడే నాయకులకు విశ్వసనీయత లభిస్తుందని చంద్రబాబు పరోక్షంగా చురకలు అంటించారు. అనంతరం, పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వైద్యుల నివేదికను చంద్రబాబు మీడియాకు అందించారు.

## విద్యార్థులకు సీఎం విజయ్ సత్కారం

(మొదటిపేజీ తరువాయి)

అగ్రస్థానంలో నిలిచిన మొదటి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి, వారికి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు, ఇతర బహుమతులను అందజేస్తారు. ఈ వేడుకకు విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించనున్నారు. మహాబలిపురంలోని ఒక ప్రైవేట్ వేదికపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం ఉంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. అర్హులైన విద్యార్థులను గుర్తించి, వారిని కార్యక్రమానికి తీసుకువచ్చే బాధ్యతలను పార్టీ జిల్లా కార్యదర్శులకు అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల్లో పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిలిచిపోవచ్చనే ఊహాగానాలు వెలువడినప్పటికీ, ఇది ప్రభుత్వ అధికారిక కార్యక్రమం కాదని, కేవలం టీవీకే పార్టీ తరపున వ్యక్తిగత చొరవతోనే కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమ తేదీ, వేదికకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

## 'ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది.. ఇప్పుడు మూల్యం చెల్లిస్తోంది'

(మొదటిపేజీ తరువాయి)

షిప్పింగ్ నిబంధనలను పాటించడానికి ఇరాన్‌కు గతంలోనే అవకాశం ఇచ్చినప్పటికీ అది మళ్లీ విఫలమైందని, అందుకే ఇరాన్ దాడి చేసే సామర్థ్యాలను దెబ్బతీసేందుకు తాము భారీ స్థాయిలో దాడులు జరిపామని అమెరికా స్పష్టం చేసింది.

### జలసంధి మూసివేత

అమెరికా దాడులు ప్రారంభించిన వెంటనే ఇరాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ వాణిజ్యానికి గుండెకాయ లాంటి హర్మూజ్ జలసంధిని 'తదుపరి నోటీసు ఇచ్చే వరకు' నిరవధికంగా మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అనుమతి లేని మార్గంలో వెళ్తున్న ఒక నౌకపై తాము జరిపిన హెచ్చరిక కాల్పులు దానికి తగిలాయని ఇరాన్ వెల్లడించింది. "ఈ తాజా ఘటన నేపథ్యంలో.. ఈ ప్రాంతంలో అమెరికా జోక్యం పూర్తిగా ముగిసేవరకు హర్మూజ్ జలసంధి మూసివేయబడుతుంది.

# డీకే శివకుమార్ జీవిత చరిత్రలో యెజ్డీ బైక్ కథ
# 40 ఏళ్ల నాటి జ్ఞాపకాలకు కొత్త జీవం!

- డీకే శివకుమార్ జీవిత చరిత్రలో వెలుగు చూసిన యెజ్డీ బైక్ కథ
- విద్యార్థి రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన పాత బైక్
- మిత్రుల చొరవతో ఆరు నెలలు శ్రమించి పునరుద్ధరణ
- ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం రోజున బైక్‌పై చక్కర్లు కొట్టిన డీకే
- పాత జ్ఞాపకాలను మరువనని చెప్పేందుకు ఇదొక నిదర్శనం



**కర్ణాటక:** రాజకీయాల్లో ఎంత ఉన్నత స్థాయికి చేరినా, తమ మూలాలను, పాత జ్ఞాపకాలను కొందరు మర్చిపోలేరు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఆ కోవలోకే వస్తారు. ఆయన రాజకీయ ప్రస్థానంలో, ముఖ్యంగా విద్యార్థి దశలో కీలక పాత్ర పోషించిన ఓ పాత యెజ్డీ రోడ్‌కింగ్ మోటార్‌సైకిల్ కథ ఇప్పుడు ఆయనపై వస్తున్న ఓ జీవిత చరిత్ర పుస్తకం ద్వారా వెలుగులోకి వచ్చింది. అధికారం, బాధ్యతల నడుమ కూడా వ్యక్తిగత జ్ఞాపకాలకు ఆయన ఎంత విలువ ఇస్తారో ఈ కథనం తెలియజేస్తోంది.
సుమారు 1980వ సంవత్సరంలో, కాలేజీ రోజుల్లో శివకుమార్ రూ.10,400 వెచ్చించి యెజ్డీ రోడ్‌కింగ్ 250సీసీ బైక్‌ను కొనుగోలు చేశారు. ఆ బైక్ నెంబరు జజూూ 7684. విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా ఉన్న ఆ రోజుల్లో ప్రచారానికి, హాస్టళ్లు, కాలేజీ గ్రౌండ్ల మధ్య తిరగడానికి ఆయన ఈ బైక్‌నే ఎక్కువగా వాడేవారు. అది ఆయన ఉత్సాహభరితమైన యవ్వనానికి ప్రతీకగా నిలిచింది. అయితే, 1989లో ఎమ్మెల్యేగా ఎన్నికై, ఆ తర్వాత అనతికాలంలోనే మంత్రిగా రాజకీయాల్లో వేగంగా ఎదుగుతున్న క్రమంలో ఆ బైక్ వాడకం తగ్గింది. దీంతో బెంగళూరులోని సదాశివనగర్‌లోని ఆయన ఇంటి ఆవరణలో ఓ మూలన పడి తుప్పు పట్టిపోయింది. ఏళ్ల తర్వాత, శివకుమార్ సన్నిహిత మిత్రుడు శ్యామ్ ఆ బైక్‌ను గమనించారు. మరో సహాయకుడు రాజశేఖర్‌తో కలిసి దానిని పునరుద్ధరించాలని నిర్ణయించుకున్నారు. వింటేజ్ బైక్‌ల పునరుద్ధరణలో నిపుణుడైన సుప్రీత్ నాయక్ నేతృత్వంలో ఈ ప్రాజెక్ట్ మొదలైంది. చెన్నై, మైసూరు, ముంబై, చివరకు వియత్నాం నుంచి కూడా అరుదైన విడిభాగాలను తెప్పించారు. దాదాపు ఆరు నెలలకు పైగా శ్రమించి, బైటరాయణపుర, కత్రిగుప్పెలోని మెకానిక్‌ల సహాయంతో ఆ బైక్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చారు. దాని ఇంజిన్‌కు ప్రత్యేక గుర్తింపు అయిన "డుగ్ డుగ్ డుగ్" శబ్దాన్ని తిరిగి వినిపించేలా చేశారు. జూన్ 2024లో, జేపీ నగర్‌లో ఉన్న శివకుమార్‌కు ఈ పునరుద్ధరించిన బైక్‌ను చూపించి ఆశ్చర్యపరిచారు. దాన్ని చూడగానే ఆయన కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. వెంటనే కిక్ స్టార్ట్ చేసి, మురిసిపోయారు. 2024 సెప్టెంబరులో పాత, కొత్త ఫొటోలతో సహా దానిని ఆయనకు అందజేశారు. దాన్ని ఒక కుటుంబ వారసత్వ సంపదలా భావించి భద్రపరుచుకున్నారు. 2025 ఆగస్టులో, ఉప ముఖ్యమంత్రి హోదాలో హెబ్బాళ్ ఫ్లైఓవర్ లూప్ ప్రారంభోత్సవం తర్వాత, తన ఖద్దరు దుస్తుల్లోనే ఆ 40 ఏళ్ల నాటి బైక్‌పై కొత్త ర్యాంప్‌పై ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ దృశ్యాన్ని సీఎం సిద్ధరామయ్య సహా పలువురు ఆసక్తిగా తిలకించారు. రషీద్ కిద్వాయ్ రచించిన "డీకే శివకుమార్ -- కాంగ్రెస్ క్రైసిస్ మేనేజర్, కర్ణాటక కింగ్‌మేకర్" అనే పుస్తకంలో ఈ కథనాన్ని పొందుపరిచారు. ఒక విద్యార్థి నాయకుడి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన ఆయన ప్రయాణాన్ని ఈ కథనం ఆవిష్కరిస్తుంది. 2026లో ఆయనకు బ్రాండ్ పట్ల ఉన్న ఇష్టానికి గుర్తుగా ఓ ఆధునిక యెజ్డీ రోడ్‌స్టర్‌ను కూడా బహుమతిగా అందించారు.

# ముగిసిన ఎస్.జానకి అంత్యక్రియలు

- అనంతలోకాలకు గానకోకిల
- మైసూరులో ప్రభుత్వ లాంఛనాలతో ఎస్. జానకి అంత్యక్రియలు
- హెచ్‌డీ కోటె తాలూకాలోని ఫామ్‌హౌస్‌లో ముగిసిన అంతిమ సంస్కారాలు
- మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో పార్థివదేహానికి నివాళులర్పించిన ప్రముఖులు
- వేలాదిగా తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికిన అభిమానులు



**మైసూరు:** ప్రముఖ గాయని, 'గాన కోకిల' ఎస్. జానకి అంతిమ యాత్ర ముగిసింది. ఆదివారం ఆమె అంత్యక్రియలు కర్ణాటక ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరిగాయి. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకాలోని ఆమె వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులు, అభిమానుల అశ్రునయనాల మధ్య తుది సంస్కారాలు నిర్వహించారు. జానకమ్మ మనవరాలు అప్సర వైద్యుల తుది కర్మలు జరిపించారు. అంతకుముందు, జానకమ్మ పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో ఉంచారు. తమ అభిమాన గాయనిని కడసారి చూసేందుకు అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు వేలాదిగా తరలివచ్చారు. భారతీయ సంగీతానికి ఆమె చేసిన సేవలను గౌరవిస్తూ, పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న 88 ఏళ్ల జానకి, శనివారం మైసూరులోని అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన అద్భుత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ సహా 20కి పైగా భాషల్లో 48,000కు పైగా పాటలు పాడి ఆమె చరిత్ర సృష్టించారు. ఆమె విశిష్ట గాత్రానికి నాలుగు జాతీయ పురస్కారాలు కూడా లభించాయి. జానకి మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సంగీత దర్శకుడు ఇళయరాజా సహా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భౌతికంగా దూరమైనా, తన గాత్రంతో ఎప్పటికీ జీవించే ఉంటారని అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు.


# సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్ట్

- వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ అరెస్ట్
- గుంటూరులోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న తెలంగాణ పోలీసులు
- సీఎం రేవంత్‌రెడ్డిపై టీవీ డిబేట్‌లో చేసిన వ్యాఖ్యలే కారణమని సమాచారం
- రేవంత్‌ను "జొమాటో డెలివరీ బాయ్" అంటూ తీవ్ర విమర్శలు
- ముందస్తు నోటీసులు లేకుండా అరెస్ట్ చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ




గుంటూరు (సింధూర దర్శిని) 12 జూలై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉన్న ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నాగార్జున యాదవ్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న తెలంగాణ పోలీసులు ఆదివారం గుంటూరుకు చేరుకున్నారు. నాగార్జున యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం, తమ వివరాలను, అరెస్ట్ సమాచారాన్ని స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తామని చెప్పి ఆయన్ను తమతో తీసుకెళ్లారు. ఒక రాష్ట్రానికి చెందిన రాజకీయ నేతను, మరో రాష్ట్ర పోలీసులు వచ్చి అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఒక టీవీ ఛానల్ చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డిని 'జొమాటో డెలివరీ బాయ్' అని సంబోధిస్తూ, ఆయన జీవోలను కూడా సరిగా చదవరని ఆరోపించారు. ఎమ్మెల్యేగా కూడా రేవంత్ సమర్థంగా పనిచేయలేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల కారణంగానే ఆయనపై కేసు నమోదై, అరెస్ట్ జరిగినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని తెలంగాణ కాంగ్రెస్ కూడా నిర్ధారించింది.

# రథోత్సవానికి పటిష్ట పోలీసు బందోబస్తు



◀ విజయవంతంగా ముగిసిన రథోత్సవం


విడవలూరు( సింధూర దర్శిని) 12 జూలై నెల్లూరు జిల్లా ; విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలో కొలువైయున్న శ్రీ కామాక్షితాయి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 05 జూలై 2026 నుండి 15 జూలై 2026 వరకు జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన శ్రీ స్వామివారి రథోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ కన్నుల పండువగా విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా సుమారు 3,500 మంది భక్తులు రథోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు, నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పర్యవేక్షణలో 160 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయబడింది. రథోత్సవ మార్గమంతా విస్తృత భద్రతా చర్యలు చేపట్టి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, క్యూలైన్ పర్యవేక్షణ, నిరంతర గస్తీ చర్యలను సమర్థవంతంగా నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు సురక్షితంగా దర్శనం చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పటిష్ట భద్రతా ఏర్పాట్ల ఫలితంగా మరియు అత్యాధునిక డ్రోన్ లను ఉపయోగిస్తూ రథోత్సవం అధ్యంతం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ, భక్తులు పోలీసు శాఖకు అందించిన సహకారానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి ధార్మిక, సామాజిక కార్యక్రమాల్లో సమర్థవంతమైన పోలీసింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

# హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు




బుచ్చిరెడ్డిపాలెం (సింధూర దర్శిని) 12 జూలై నెల్లూరు జిల్లా ; బుచ్చిరెడ్డిపాలెం మండల వ్యవసాయ అధికారి హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్
బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త మినగల్లు గ్రామానికి చెందిన మండల వ్యవసాయ అధికారి నడవాటి శ్రీహరి మృతి కేసు దర్యాప్తులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. తేదీ 06.07.2026 న మృతుడి భార్య ఎన్. లావణ్య తన భర్త మృతి పరిస్థితులపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ అజిత వేజెండ్ల ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని వెంటనే ఆదేశాలు జారీ చేశారు. దీని మేరకు బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్‌లో హత్య మరియు నేరానికి సంబంధించిన సాక్ష్యాలను రూపుమాపడం కు సంబంధించిన చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయబడింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు బాధ్యతలను నెల్లూరు రూరల్ సబ్-డివిజనల్ పోలీసు అధికారి ఘట్టమనేని శ్రీనివాసరావు కి అప్పగించారు. డీఎస్పీ కేసు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తూ, సాక్షులు, రక్త సంబంధీకులు మరియు ఇతర కీలక వ్యక్తులను విచారించారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు గోలగమూడికి చెందిన సోంపల్లి రవీంద్ర మరియు రామతీర్థానికి చెందిన బుచ్చింగారి యానాదయ్యలను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి ప్రమేయాన్ని నిర్ధారించే బలమైన సాక్ష్యాధారాలు లభించడంతో వారిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం వారిని రిమాండ్‌కు తరలించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కుడుముల హరికృష్ణ, టీపీ గూడూరు మండలం, రావూరివారి కండ్రిగ గ్రామానికి చెందిన వ్యక్తి. ఇతడు మృతుడికి బావమరిది. ప్రస్తుతం పరారీలో ఉన్న అతడిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు విస్తృత గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ కేసులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, నిందితులను అరెస్టు చేసే విషయంలో ఎలాంటి ఉపేక్ష ఉండదని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ అజిత వేజెండ్ల స్పష్టం చేశారు.

# విశాఖలో స్వల్ప భూకంపం.. ఉలిక్కిపడిన నగరవాసులు




◀ విశాఖపట్నంలో ఆదివారం
◀ తెల్లవారుజామున స్వల్ప భూప్రకంపనలు
◀ భూమి కంపించడంతో భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన ప్రజలు
◀ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4 నుంచి 4.5గా నమోదు

విశాఖ (సింధూర దర్శిని) 12 జూలై విశాఖపట్నం నగరంలో సంభవించిన భూప్రకంపనలు తీవ్ర కలకలం సృష్టించాయి. ఆదివారం తెల్లవారుజామున స్వల్పంగా భూమి కంపించడంతో గాఢ నిద్రలో ఉన్న నగర ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీయడంతో పలు ప్రాంతాల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ఈ ప్రకంపనల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నగరంలోని సాగర్ నగర్, తాటిచెట్లపాలెం, సీతమ్మధార, మాధవధార, పెద వాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీ, హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 4.0 నుంచి 4.5గా నమోదైంది. బంగాళాఖాతంలో పది కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని అధికారులు గుర్తించారు.

# విజయవాడ ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం



◀ అగ్నికి ఆహుతైన ఏడు ప్రైవేట్ బస్సులు
◀ మెకానిక్ షెడ్‌లో మొదలైన మంటలు
◀ ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
◀ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు

విజయవాడ (సింధూర దర్శిని) 12 జూలై నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమా దం సంభవించింది. ఈ ఘటనలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మర మ్మతుల కోసం మెకానిక్ షెడ్‌లో నిలిపి ఉంచిన బస్సు లకు మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని ఓ మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం ఒక బస్సును నిలిపారు. ఆ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుం డగానే పక్కన పార్క్ చేసి ఉన్న మిగతా ఆరు బస్సులకు కూడా మంటలు వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిం చారు. సమాచారం అందుకున్న వెంటనే మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమవడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.



## ముఖ్యమంత్రితో కలిసి డిప్యూటీ సీఎంని పరామర్శించిన మంత్రి నారాయణ

ముంబాయి ( సింధూర దర్శిని) 12 జూలై ముంబయి ఆసుపత్రిలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో కలిసి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అదివారం పరామర్శించారు. పవన్ కళ్యాణ్ తో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నారాయణతో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్ పవన్ కళ్యాణ్ ను పరామర్శించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని మంత్రి నారాయణ ఆకాంక్షించారు.


## నేడు మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు( సింధూర దర్శిని) 12 జూలై నెల్లూరు జిల్లా ; ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ Meekosam.ap.gov.in ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సం2బంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ ను సంప్రదించవచ్చును. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు





గూడూరు( సింధూర దర్శిని) 12 జూలై నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండల పరిధి లోని తూర్పు కనుపూర్ గ్రామంలో స్వయం భుగా వెలసి నిత్యం పూజలు అందుకుం టున్న ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ఆలయ ఈవో కొమ్మలపూడి నవీన్ కుమార్ , ఆలయ చైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి పర్యవే క్షణలో ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహి ంచారు. అనంతరం జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులు ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం అంతా సందడి వాతావరణం నెలకొంది.

## గానకోకిల ఎస్. జానకి మృతి పట్ల నెల్లూరు ఎంపీ , కోవూరు ఎమ్మెల్యే తీవ్ర సంతాపం

నెల్లూరు( సింధూర దర్శిని) 12 జూలై నెల్లూరు జిల్లా ; ప్రముఖ నేపథ్య గాయని, గానకోకిల శ్రీమతి ఎస్. జానకి కన్నుమూశారనే వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... దశాబ్దాల పాటు తన మధురమైన గాత్రంతో దక్షిణ భారత సినీ సంగీత ప్రపం చాన్ని ఏలిన జానకి , కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. వేలాది అద్భు తమైన పాటలకు ప్రాణం పోసి, ఎందరో వర్ధమాన గాయనీగాయకులకు ఆమె ఆదర్శంగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. ఆమె మరణం కేవలం తెలుగు సినీ పరిశ్రమకే కాకుండా, యావత్ భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జానకి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మరియు కోట్లాది మంది అభిమానులకు తన సానుభూతిని తెలియజేశారు.

# ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై సమీక్ష




### భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్

తిరుపతి( సింధూర దర్శిని) 12 జూలై తిరుపతి జిల్లా ; ఎస్ ఐ ఆర్ ప్రక్రియ లో భాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టాలని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్ ఆదేశించారు.ఎస్ ఐ ఆర్ కార్యక్రమం లో భాగంగా ఆదివారం తిరుపతి పట్టణంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ విధానం పై స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం లో జేసి ఆర్ గోవిందరావు, నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, తదితరులతో కలసి భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్ సమీక్ష నిర్వహించి దశా నిర్దేశం చేశారు. సమీక్షా సమావేశం అనంతరం మున్సిపల్ భారత ఎలక్షన్ కమిషన్ అధికారులు బృందం సెక్షన్ ఆఫీసర్ అనిత కుక్రేజా, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉదిత్ కుమార్ లతో కలసి క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించారు.కేంద్ర ఎన్నికల కమిషన్ బృందం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా తిరుపతి పట్టణం లోని రామకృష్ణ థియేటర్ సర్కిల్ 38వ పోలింగ్ స్టేషన్ పరిధిలోని 37 వ వార్డు, లక్ష్మీపురం 12వ వార్డు సచివాలయం పరిధిలోని పోలింగ్ స్టేషన్ ల వారీగా ఉన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. తదుపరి చంద్రగిరి అసెంబ్లీ ఏసి, తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ, చిన్నగొట్టిగలు మండలం భాకరాపేట, ఎర్రావారిపాలెం మండలం నెరబైలు పరిధిలోని పోలింగ్ స్టేషన్ పరిధిలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు.ఈ సందర్భంగా సూపర్వైజర్స్ ను తమ పరిధిలో గల బిఎల్ లు, పోలింగ్ స్టేషన్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ ల పరిధిలో గల ఓటర్ల సంఖ్య, సేకరించిన ఎన్యూమరేషన్ ఫారమ్స్ సంఖ్య ను ఆరా తీశారు. తదుపరి ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ పరిశీలించి సచివాలయ సిబ్బంది మరియు బిఎల్ఎ లతో మాట్లాడారు. తిరుచానూరు పరిధిలో ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చినవారు ఉండడం తో వారు తిరిగి వెళ్ళిపోయిన నేపథ్యంలో 2002 ఓటర్ల జాబితా తో పోల్చలేకున్నామని వివరించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని బి ఎల్ ఏ లతో విచారించగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వైకుంఠపురం లోని 250 పోలింగ్ స్టేషన్ పరిధిలోని 19 వ వార్డు ఇంటింటి సర్వే లో పాల్గొని హౌస్ హోల్డర్స్ తో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్ డి ఓ రామ్మోహన్, తిరుపతి అర్బన్ తహసిల్దార్ సురేష్ బాబు, తిరుపతి రూరల్ తాసిల్దార్ జనార్ధన్ రాజు, సచివాలయం సిబ్బంది బిఎల్ఓ లు, బి ఎల్ ఏ లు, తదితరులు పాల్గొన్నారు.

# రవాణా రంగ కార్మికులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందించాలి

### సి.ఐ.టి.యు ఆటో యూనియన్ జిల్లా నాయకులు బి.వి.రమణయ్య



గూడూరు ( సింధూర దర్శిని) 12 జూలై నెల్లూరు జిల్లా ; రవాణా రంగ కార్మికుల పట్ల అధిక శాతం లాభాలు పొందుతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మినీ ట్రక్,లారీ, ఆటో కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్నాయని,సహాయ సహకారాలు వారి కుటుంబాలకు అందజేయాలని,సి.ఐ.టి.యు ఆటో యూనియన్ జిల్లా నాయకులు బి.వి.రమణయ్య ఆదివారం రోజు గూడూరు లోని సి.ఐ.టి.యు కార్యాలయంలో జరిగిన ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సి.ఐ.టి.యు గూడూరు మినీ ట్రక్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను సాకుగా చూపుతూ పెట్రోల్,డీజిల్,గ్యాస్ నిత్యవసర వస్తువులు,స్పేర్ పార్ట్స్, ఆయిల్,ధరలు విపరీతంగా పెంచి రవాణా రంగాన్ని సంక్షోభంలోకి పోయే విధంగా ఈ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగితే వెను వెంటనే ధరలను పెంచే ప్రభుత్వాలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర భారీగా తగ్గినా ఈ ప్రభుత్వాలు ఎందుకు తగ్గించడం లేదని, పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని,అలాగే ఎల్.ఎల్.ఆర్. మంజూరుకు కంప్యూటర్ నుంచి మినహాయింపు ఇవ్వాలని,వాహనాల ఇన్సూరెన్స్, పొల్యూషన్ లకు ఓ.టి.పి విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఏ.రాజగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు కె.సుధాకర్ యాదవ్,ప్రధాన కార్యదర్శి ఎం. ఈశ్వరయ్య యాదవ్, సహాయ కార్యదర్శి సి. హెచ్.శ్రీనివాసులు, కోశాధికారి డి.వేణు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటి సభ్యులు గా నవకోటి మస్తాన్,సి. హెచ్.నాగేంద్ర, పి.కోటేశ్వరరావు,వి.శ్రీనివాసులు,బి.గురవయ్య,పి.సాయి కుమార్, ఏ.విజయచంద్ర,జి.వెంకటేశ్వర్లు,కొనసాగనున్నారు.

# కళ్ల ముందే ఘోరం.. వియత్నాం బోటు ప్రమాదంపై ప్రత్యక్ష సాక్షుల కథనం

- వియత్నాంలో ఘోర బోటు ప్రమాదం.. 15 మంది భారతీయుల మృతి
- ఫోటోలు తీసుకుంటుండగా ఒక్కసారిగా బోల్తా పడ్డ స్పీడ్‌బోట్
- పెద్ద కెరటం వల్లే ప్రమాదం జరిగిందన్న ప్రత్యక్ష సాక్షులు
- మృతుల్లో ఏపీ, తమిళనాడు, కేరళ వాసులు
- మృతదేహాల తరలింపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు



వియత్నాం ( సింధూర దర్శిని) 12 జూలై వియత్నాంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదం నుంచి ప్రాణాలతో బయటపడిన వారు ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. కళ్ల ముందే మృత్యువును చూశామని, అసలు ప్రమాదం ఎలా జరిగిందో వివరించారు.శనివారం మధ్యాహ్నం స్థానిక కాలమానం ప్రకారం 1:30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ఫు క్విక్ ద్వీపానికి సమీపంలోని ఓ చిన్న ద్వీపం నుంచి బయల్దేరిన 300-400 మీటర్ల దూరంలోనే స్పీడ్‌బోట్ బోల్తా పడింది. “ప్రమాదం జరిగినప్పుడు తామంతా ఫొటోలు తీసుకుంటున్నాం. స్పందించేలోపే అంతా జరిగిపోయింది. అందరం ప్రాణభయంతో కేకలు వేశాం” అని ప్రాణాలతో బయటపడ్డ గుంటూరుకు చెందిన ఆశిష్ కుమార్ తెలిపారు.సముద్రంలోకి కొంత దూరం వెళ్లాక ఒక్కసారిగా ఓ పెద్ద కెరటం బోటును బలంగా తాకిందని తమిళనాడుకు చెందిన మురుగరాజ్ అనే బాధితుడు వివరించారు. ఆ దెబ్బకు బోటు కుడివైపునకు పూర్తిగా ఒరిగిపోయింది. దీంతో ప్రయాణికులంతా ఒకరిపై ఒకరు పడిపోయారు. “బోటు వేగంగా మునిగిపోతుండటంతో ఎలాగోలా కిటికీలోంచి బయటపడి, బోటు రెయిలింగ్‌ను పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాను” అని ఆయన తెలిపారు. భారీ కెరటాలు, బోటులో పరిమితికి మించి ప్రయాణికులు ఉండటం వల్లే క్షణాల్లో ఈ ఘోరం జరిగిందని మరో బాధితుడు నిర్మల్ కుమార్ అభిప్రాయపడ్డారు.

ప్రమాద సమయంలో బోటులో 32 మంది భారతీయ పర్యాటకులు, నలుగురు స్థానిక సిబ్బందితో కలిపి మొత్తం 36 మంది ఉన్నారు. వీరిలో 21 మందిని సహాయక బృందాలు రక్షించాయి. ప్రమాదం జరిగిన 5 నిమిషాల్లోనే రెస్క్యూ బృందాలు అక్కడికి చేరుకున్నాయని బాధితులు తెలిపారు. మృతుల్లో 10 మంది తమిళనాడు, ముగ్గురు ఆంధ్రప్రదేశ్, ఇద్దరు కేరళకు చెందిన వారుగా గుర్తించారు. ప్రముఖ మొబైల్ ఫోన్ల సంస్థ ‘లావా’ తమ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల కోసం ఈ ట్రిప్‌ను ఏర్పాటు చేసింది. సేల్స్ టార్గెట్లు పూర్తి చేసిన వారికి బహుమతిగా ఈ విహారయాత్రను ప్రకటించింది. వియత్నాంలోని ఫు క్విక్ ద్వీపం అందమైన బీచ్‌లకు, పగడపు దిబ్బలకు ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతం.

ఈ ఘటనపై లావా మొబైల్స్ సంస్థ స్పందించింది. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపింది. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, మృతదేహాలను వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించేందుకు కృషి చేస్తున్నామని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయి.



## పెంచలయ్య అంత్యక్రియలకు రాజనేని ఆర్థిక సాయం

గూడూరు( సింధూర దర్శిని) 12 జూలై నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండలం నెలబల్లి,రెట్టపల్లి గ్రామ దళితవాడకు చెందిన మంద పెంచలయ్య 47సం” అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగించే వాడు అయితే అతనికి 5సంవత్సరాల క్రితం పక్షవాతం రావడంతో అప్పటినుండి ఏ పని చేసుకోలేని స్థితిలో మంచంలో ఉన్నాడు. ఆదివారం ఉదయం పెంచలయ్య మరణించాడు.వారిది పేద కుటుంబం కావడంతో గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు వెంటనే స్పందించి అంత్యక్రియల ఖర్చులకోసం 15వేల రూపాయలను ట్రస్ట్ సభ్యుడైన బాబు ద్వారా పెంచలయ్య కుటుంబానికి అందజేయడం జరిగింది.

## తిరుపతిలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం రద్దు



- జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - సర్-2026 కార్యక్రమం వున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పి జి ఆర్ ఎస్ కార్యక్రమం రద్దు
- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి( సింధూర దర్శిని) 12 జూలై తిరుపతి జిల్లా ; జిల్లాలో జూలై 13 వ తేదీన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -- సర్-2026 కార్యక్రమం వున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించే పి జి ఆర్ ఎస్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జూలై 13 ( సోమవారం ) న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -- సర్-2026 కార్యక్రమం వున్న నేపథ్యంలో మండల స్థాయి, డివిజన్ స్థాయి జిల్లా వ్యాప్తంగా సిబ్బంది అందురు సర్ కార్యక్రమం లో పాల్గొని నిమగ్నమై ఉన్న నేపథ్యంలో జిల్లా , డివిజన్ , మండల స్థాయి అధికారులు వివిధ విధులను నిర్వహిస్తున్నందున జిల్లా వ్యాప్తంగా సోమవారం నాటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్ ) కార్యక్రమాన్ని రద్దు పరుస్తున్నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు .ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## గణపయ్యను దర్శించుకున్న సి ఎస్ ఓ మురళీకృష్ణ



కాణిపాకం (సింధూర దర్శిని) 12 జూలై చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం సిఎస్ఓ మురళీకృష్ణ , కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, కాణిపాకం ఎస్.ఐ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రదోషకాల పూజ



కాణిపాకం ( సింధూర దర్శిని ) 12 జూలై చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ మణికంఠేశ్వర స్వామి వారి ఆలయము నందు ఆదివారం సాయంత్రం ప్రదోషకాల పూజ సందర్భంగా వైభవంగా స్వామివారి మూలవిరాట్ మరియు నందీశ్వర స్వామివారికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకములు, మరియు ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ కోదండపాణి, అధికారులు, అర్చకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత జీవితంలో ఎన్నో కష్టాలు.. జానకమ్మను తలచుకుని కదిలిపోయిన ఇళయరాజా

- ప్రముఖ గాయని ఎస్. జానకి మృతిపై ఇళయరాజా తీవ్ర భావోద్వేగం
- జానకమ్మ మరణవార్త తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్న ఇళయరాజా
- వ్యక్తిగత జీవితంలో ఆమె భరించలేని దుఃఖాన్ని మోశారని ఆవేదన
- తన అంచనాలను మించి పాడే అంకితభావం ఆమె సొంతమని వెల్లడి
- ఆమె స్థానం భర్తీ చేయలేనిదని, మరో గాయని ఆమెతో పోల్చలేనిదని వ్యాఖ్య



**కర్ణాటక :** ప్రముఖ గాయని ఎస్. జానకి మృతి పట్ల దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజా తీవ్ర భావోద్వేగంతో నివాళులర్పించారు. ఆమె మరణం తనకు వ్యక్తిగతంగా తీరని లోటని పేర్కొన్నారు. తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పంచుకున్న ఆయన, జానకమ్మ మరణవార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి, ఆవేదనకు గురిచేసిందని అన్నారు. భారతీయ సంగీత ప్రపంచం తన అత్యంత ప్రతిభావంతులైన స్వరాలలో ఒకదాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.జానకి వ్యక్తిగత జీవితంలోని విషాదాలను గుర్తుచేసుకుంటూ ఇళయరాజా కదిలిపోయారు. "ప్రియమైన గాయని జానకమ్మ మరణవార్త విని తీవ్రంగా కలత చెందాను. ఇది దిగ్భ్రాంతికరమైన, హృదయవిదారకమైన వార్త. ఆమె తన వ్యక్తిగత జీవితంలో భరించలేని దుఃఖాన్ని మోశారు, ఎన్నో బాధాకరమైన అనుభవాలను ఎదుర్కొన్నారు. తన సంగీతంతో కోట్లాది మందికి ఆనందాన్ని పంచిన ఆమె, నిజ జీవితంలో అన్ని కష్టాలను అనుభవించడం గురించి ఆలోచిస్తుంటే చాలా బాధగా ఉంది," అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.జానకితో తనకున్న సుదీర్ఘ వృత్తిపరమైన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆమెలోని అంకితభావాన్ని కొనియాడారు. రికార్డింగ్ స్టూడియోలో తాను ఒక పాటలో ఏదైనా ప్రత్యేకమైన భావవ్యక్తీకరణను ఆశించినప్పుడు, అది పరిపూర్ణంగా వచ్చే వరకు జానకమ్మ ఏమాత్రం అలసట లేకుండా సాధన చేసేవారని ఇళయరాజా గుర్తుచేసుకున్నారు. తాను ఆశించిన స్థాయికి పాట చేరే వరకు ఆమె విశ్రమించేవారు కాదని, పరిపూర్ణత కోసం ఆమె పడే తపనే ఆమెను అసాధారణమైన కళాకారిణిగా నిలబెట్టిందని వివరించారు."ప్రతి పాటలో నేను కోరుకున్న సంగీత భావాన్ని తీసుకురావడానికి ఎంతగానో కష్టపడతాను. జానకమ్మ కూడా అంతే పట్టుదలతో నా అంచనాలకు మించి ఆ పాటను పరిపూర్ణంగా తీర్చిదిద్దేవారు. చాలా సందర్భాల్లో ఆమె నా అంచనాలను కూడా మించిపోయారని చెప్పగలను" అని ఇళయరాజా అన్నారు. ఆమెతో మరే గాయనినీ పోల్చలేమని, ప్రతి ప్రదర్శనలో భావోద్వేగం, సాంకేతిక పరిపూర్ణత, అంకితభావాన్ని అరుదైన కలయికతో ఆమె ప్రదర్శించేవారని తెలిపారు. జానకమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, సంగీత ప్రియుల తరతరాలు ఆమె మరపురాని పాటలను, ఆమె మిగిల్చిన శాశ్వత వారసత్వాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటాయని ఇళయరాజా తన నివాళిని ముగించారు.

# కర్ణాటక ప్రభుత్వ లాంఛనాలతో ఎస్.జానకి అంత్యక్రియలు




- ప్రఖ్యాత గాయని ఎస్. జానకి (88) కన్నుమూత
- మైసూరులో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- ప్రజా సందర్శనార్థం మహారాజ కాలేజీ గ్రౌండ్స్‌లో పార్థివదేహం
- ఆరు దశాబ్దాల కెరీర్‌లో 50 వేలకు పైగా పాటలు పాడిన గాన కోకిల
- భారత సంగీతానికి తీరని లోటని ప్రముఖుల నివాళి

**మైసూరు:** ప్రఖ్యాత గాయని ఎస్. జానకి (88) కన్నుమూయడంతో భారతీయ చిత్ర పరిశ్రమలో, అభిమానుల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆరు దశాబ్దాలకు పైగా తన గాన మాధుర్యంతో కోట్లాది మందిని మంత్రముగ్ధుల్ని చేసిన ఆమె నిన్న తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో, కర్ణాటక ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు ఈరోజు (జూలై 12) సాయంత్రం 5 గంటలకు మైసూరులో జరగనున్నాయి.అభిమానులు, ప్రజల సందర్శనార్థం జానకమ్మ పార్థివదేహాన్ని ఈ ఉదయం 7:30 గంటల నుంచి మైసూరులోని మహారాజ కాలేజీ గ్రౌండ్స్‌లో ఉంచారు. తమ అభిమాన గాయనికి కడసారి వీడ్కోలు పలికేందుకు వేలాదిగా అభిమానులు తరలివచ్చి నివాళులు అర్పిస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు కనియర హుండి గ్రామంలోని ఫామ్‌హౌస్‌లో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఎస్. జానకి తన కెరీర్‌లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ సహా 20కి పైగా భాషల్లో 50 వేలకు పైగా పాటలను రికార్డ్ చేసి అరుదైన ఘనత సాధించారు. భారత ప్రభుత్వం ఆమెను పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది.జానకి మృతి పట్ల మైసూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎస్. యతీ ంద్ర ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. ఆమె మరణం భారత సంగీతానికి తీరని లోటని పేర్కొన్నారు. జానకి మన వరాలు అప్సర వైద్యుల సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని వెల్లడిస్తూ, తమ ప్రియమైన బామ్మ కోట్లాది మందికి తన స్వరంతో ఆనందాన్ని పంచారని గుర్తుచేసుకున్నారు.

# మెల్బోర్న్‌లో ఏపీఎన్ఆర్‌టీ కో-ఆర్డినేటర్ల ఆత్మీయ సమావేశం


- ఆస్ట్రేలియాలో ఏపీఎన్ఆర్‌టీ నూతన కో-ఆర్డినేటర్ల ఆత్మీయ సమావేశం
- కేక్ కట్ చేసి, సత్కారాలతో ఒకరికొకరు శుభాకాంక్షలు
- కూటమి ప్రభుత్వానికి పూర్తిస్థాయి మద్దతివ్వాలని కీలక చర్చ
- రాష్ట్ర అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తామని నిర్ణయం
- తమకు బాధ్యతలు అప్పగించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు




**ఆస్ట్రేలియా:** ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ నగరంలో ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీ) నూతన కో-ఆర్డినేటర్ల సమావేశం అత్యంత ఆత్మీయ, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు అందించాలని, రాష్ట్ర అభివృద్ధిలో క్రియాశీలక భాగస్వాములు కావాలని ఈ సమావేశంలో ప్రవాసాంధ్రులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రవాసులకు మధ్య వారధులుగా పనిచేస్తామని వారు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కో-ఆర్డినేటర్లు అందరూ కలిసి కేక్ కట్ చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకు న్నారు. అనంతరం, పదవులు పొందిన ప్రతినిధులం దరినీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. తమకు ఈ కీలక బాధ్యతలు అప్పగించి, ప్రవాసాంధ్రుల సేవలో పాలుపంచుకునే అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి ఎన్ఆర్ఐల తరఫున ఏ విధంగా మద్దతు ఇవ్వాలనే దానిపై ప్రధానంగా దృష్టి సారించారు. కేవలం ఆర్థికంగానే కాకుండా, తమ నైపుణ్యాలు, అంతర్జాతీయ అనుభవాన్ని కూడా రాష్ట్ర ప్రగతికి అందించాలని నిర్ణయించారు. ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవాసాంధ్రుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, వారిని చైతన్యవంతం చేయాలని తీర్మానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంలో తమ వంతు పాత్ర పోషిస్తామని కో-ఆర్డినేటర్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతికి శాయశక్తులా కృషి చేస్తామని వారు పునరుద్ఘాటించారు.ఈ విజయవంతమైన కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీ రీజినల్ కో-ఆర్డినేటర్ లగడపాటి సుబ్బారావు, ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ సభ్యులు నర్మదా జొన్నలగడ్డ, గోపి నంబళ్లతో పాటు నూతన కో-ఆర్డినేటర్లు సుమా తాటినేని, కిశోర్ బలుసు, బాల పసుపులేటి పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో ఇతర కో-ఆర్డినేటర్లు, పలువురు ప్రవాసాంధ్ర ప్రముఖులు హాజరయ్యారు.

# జమ్మూకశ్మీర్‌లో 'ఆపరేషన్ లోటస్' కలకలం.. నేషనల్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యేలకు బీజేపీ ఆఫర్?

**ఢిల్లీ:** జమ్మూకశ్మీర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 'ఆపరేషన్ లోటస్'కు తెరలేపిందని, తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంచలన ఆరోపణలు చేశారు. శనివారం శ్రీనగర్‌లోని హజ్రత్‌బాల్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. "బీజేపీకి చెందిన ఓ కీలక నేత, సుప్రీంకోర్టు న్యాయవాది మా పార్టీ ఎమ్మెల్యేను రహస్యంగా కలిశారు. పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల నగదు, మంత్రి పదవి ఇస్తామని, జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తామని ఆశ చూపారు. కానీ మా ఎమ్మెల్యేల విశ్వాసాన్ని, నిబద్ధతను వారు కొనలేకపోయారు. రూ.100 కోట్లు ఇచ్చినా నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు అమ్ముడుపోరు. బలహీనులుగా భావించి వెనుక ద్వారం గుండా అధికారంలోకి రావాలని బీజేపీ చూస్తోంది" అని తీవ్రంగా విమర్శించారు.






## వియత్నాం ప్రమాదం: ఈ రాత్రికి హైదరాబాద్ చేరుకోనున్న తెలుగు పర్యాటకులు

- వియత్నాం బోటు ప్రమాదం
- హనోయి విమానాశ్రయం నుంచి తెలుగు పర్యాటకులు
- హైదరాబాద్‌కు తిరుగుపయనం
- ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి వియత్నాంలో చికిత్స
- మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు భారత
- రాయబార కార్యాలయం చర్యలు
- బాధితులకు అండగా నిలుస్తున్న ఏపీ ప్రభుత్వం, భారత ఎంబసీ

**వియత్నాం:** వియత్నాంలో శనివారం జరిగిన ఘోర పడవ ప్రమాదం నుంచి బయటపడిన తెలుగు పర్యాటకులంతా సురక్షితంగా హనోయిలోని నోయ్ బాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరంతా ఆదివారం రాత్రి 7:05 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానంలో బయల్దేరి, భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకల్లా హైదరాబాద్ చేరుకోనున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.ఫు క్వోక్ ద్వీపం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 15 మంది భారతీయులు మృతిచెందగా, వారిలో ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నారు. ఓ మొబైల్ ఫోన్ కంపెనీ తమ డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన విహారయాత్రలో ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బోటులో మొత్తం 32 మంది ఉన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏపీకి చెందిన గెల్లి కిశోర్ అనే వ్యక్తి వియత్నాంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని అధికారులు తెలిపారు.ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితులను వీలైనంత త్వరగా వారి స్వస్థలాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.మరోవైపు, మరణించిన 15 మంది భారతీయుల మృతదేహాలను హో చి మిన్ నగరానికి తరలిస్తున్నట్లు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ఆదివారం వెల్లడించింది. అక్కడ అవసరమైన లాంఛనాలు పూర్తి చేసిన తర్వాత, మృతదేహాలను వీలైనంత త్వరగా భారత్‌కు పంపిస్తామని పేర్కొంది. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, ఏపీ ప్రభుత్వం, న్యూఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు బాధితులకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారు.

## హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఫెరారీ కారు బీభత్సం



- జూబ్లీహిల్స్‌లో అపార్ట్‌మెంట్ గేటును ఢీకొట్టిన ఫెరారీ కారు
- ప్రమాదం తర్వాత కారును వదిలేసి పరారైన వ్యక్తులు
- మద్యం మత్తులో అతివేగమే కారణమని పోలీసుల ప్రాథమిక అనుమానం
- వారంలోపే ఇదే ప్రాంతంలో ఇది రెండో రోడ్డు ప్రమాద ఘటన
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా వ్యక్తుల కోసం గాలిస్తున్న పోలీసులు

హైదరాబాద్ (సింధూర దర్శిని) 12 జులై : హైదరాబాద్‌లోని సంపన్నులు నివసించే జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున ఓ లగ్జరీ కారు బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చిన ఫెరారీ కారు అదుపుతప్పి ఓ అపార్ట్‌మెంట్ గేటును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, అయితే కారులో ఉన్నవారు దానిని అక్కడే వదిలేసి పరారయ్యారని అధికారులు తెలిపారు.ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 5లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఫోర్ట్ వ్యూ అపార్ట్‌మెంట్స్ గేటును కారు ఢీకొట్టడంతో అది పూర్తిగా ధ్వంసమైంది. సుమారు రూ. 3.50 కోట్లకు పైగా విలువ చేసే ఫెరారీ రోమా కారు ముందు భాగం కూడా నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్, అందులోని ఇతర వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మద్యం మత్తులో అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కారులో ఎంతమంది ఉన్నారనేది తెలుసుకునేందుకు సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ధ్వంసమైన కారును టోయింగ్ వాహనం సహాయంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కొన్ని రోజుల వ్యవధిలో జూబ్లీహిల్స్‌లో ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. జూలై 9న రాత్రి, రోడ్ నంబర్ 10లో ప్రముఖ నటుడు ధర్మ ఇంటి కాంపౌండ్ వాల్‌ను ఓ ఎస్‌యూవీ ఢీకొట్టింది. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న కార్తీక్ కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పుడు మరో ఘటన జరగడంతో ఈ ప్రాంతంలో వరుస ప్రమాదాలు కలకలం రేపుతున్నాయి.




## రాష్ట్రంలో కుల, మత చిచ్చుకు వైసీపీ కుట్ర: ఎమ్మెల్యే వంశీకృష్ణ

- రాజకీయ లబ్ధి కోసం వైసీపీ కుల, మత ఘర్షణలు సృష్టిస్తోందని ఆరోపణ
- విజయవాడ ఘటన వెనుక ప్రతిపక్షం కుట్ర ఉందన్న జనసేన ఎమ్మెల్యే వంశీ
- సనాతన ధర్మంపై నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే
- విభజన రాజకీయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

విశాఖపట్నం (సింధూర దర్శిని) 12 జులై : హిందూ సంప్రదాయాలపై కుట్రల గురించి విచారణ జరపాలని డిమాండ్ఆంధ్రప్రదేశ్‌లో కుల, మతాల మధ్య విద్వేషాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ధ్వజమెత్తారు. సమాజంలోని వివిధ వర్గాల మధ్య విభజన తీసుకురావడమే లక్ష్యంగా వైసీపీ అడుగులు వేస్తోందని ఆయన విమర్శించారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల విజయవాడలో చోటుచేసుకున్న ఓ ఘటన వెనుక ప్రతిపక్ష పార్టీ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ప్రజా సంక్షేమంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఇదే క్రమంలో వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. సనాతన ధర్మంపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆయనపై తెలుగు చలనచిత్ర పరిశ్రమ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ సంప్రదాయాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. విశాఖపట్నంలోని కాలుష్య సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని వంశీకృష్ణ వివరించారు. ఇటువంటి విభజన రాజకీయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన సమయంలో ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## తిరుమల మెట్ల మార్గంలో భక్తుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టండి: పవన్ కల్యాణ్



తిరుమల (సింధూర దర్శిని) 12 జులై : తిరుమల అలిపిరి నడక మార్గంలో చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో, భక్తుల భద్రత విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఏపీ ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. యాత్రికుల ప్రశాంతతకు ఎలాంటి భంగం వాటిల్లకుండా తక్షణమే పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. అలిపిరి కాలినడక మార్గంలోని దొరసాని మండపం వద్ద చిరుత సంచరించిన విషయాన్ని అధికారులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన, భక్తుల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. అటవీ శాఖ, టీటీడీ అటవీ విభాగం, విజిలెన్స్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చిరుత సంచారం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన 'హనుమాన్' (H.A.N.U.M.A.N.) బృందాలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. "భక్తులను నిరంతరం అప్రమత్తం చేయాలి. సున్నితమైన ప్రాంతాల్లో దట్టంగా పెరిగిన పొదలను తొలగించి, మార్గం స్పష్టంగా కనిపించేలా చర్యలు చేపట్టాలి. యాత్రికులు గుంపులు గుంపులుగా వెళ్లేలా అవగాహన కల్పించాలి. చిరుత సంచారం వార్తలతో భక్తులు ఆందోళనకు గురికాకుండా, వారికి భరోసా కల్పించేలా భద్రతా ఏర్పాట్లు ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు.

## 'లెనిన్' దర్శకుడిని ఘనంగా సత్కరించిన టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని



అమరావతి (సింధూర దర్శిని) 12 జులై : అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. గ్రామీణ ప్రతీకార యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. జూలై 10న విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటూ విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తాజాగా, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దర్శకుడు కిశోర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

# ఫిన్లాండ్ లో భారతీయ విద్యార్థి మిస్సింగ్

### ఆ మృతదేహం తమ కుమారుడిది కాదంటున్న తల్లిదండ్రులు!

- ఫిన్లాండ్‌లో హైదరాబాద్ విద్యార్థి మణిదీప్ కేసులో కీలక మలుపు
- లభ్యమైన మృతదేహం మణిదీప్‌దేనన్న ఫిన్లాండ్ పోలీసులు
- అది మా అబ్బాయిది కాదంటూ తిరస్కరించిన కుటుంబ సభ్యులు
- దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- న్యాయం చేయాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి



**ఫిన్లాండ్:** ఫిన్లాండ్‌లో ఉన్నత విద్య కోసం వెళ్లి మే 5న అదృశ్యమైన హైదరాబాద్ విద్యార్థి మణిదీప్ రెడ్డి గుజ్జ (18) కేసులో బిగ్ ట్విస్ట్ చోటుచేసుకుంది. సముద్ర తీరంలో లభ్యమైన ఒక మృతదేహం మణిదీప్‌దేనని ఫిన్లాండ్ పోలీసులు ప్రకటించగా, ఆ వాదనను అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా ఖండించారు. లభించిన మృతదేహం తమ కుమారుడిది కాదని వారు స్పష్టం చేయడంతో ఈ కేసులో మరిన్ని అనుమానాలు తలెత్తుతున్నాయి. కేసు వివరాల్లోకి వెళితే.. సముద్ర తీరంలో ఒక మృతదేహం లభించిందని, బయోమెట్రిక్ డేటా, వ్యక్తిగత వస్తువుల ఆధారంగా అది మణిదీప్‌దేనని ప్రాథమికంగా గుర్తించినట్లు ఫిన్లాండ్ పోలీసులు ఈమెయిల్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఫిన్లాండ్‌లోని భారత రాయబార కార్యాలయం సైతం ఈ విషయాన్ని మణిదీప్ తల్లిదండ్రులకు తెలియజేసింది. అయితే, పోలీసుల ప్రకటనను మణిదీప్ తండ్రి జి. ముత్యం రెడ్డి తోసిపుచ్చారు. సదరు మృతదేహం తమ కుమారుడిది కాదని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. సుమారు 65 రోజుల తర్వాత ఇప్పుడు మృతదేహం లభించడంపై కుటుంబ సభ్యులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నిబంధనల ప్రకారం మూడు వారాల్లో కేసును మూసివేయాలనే ఒత్తిడితో, ఎవరో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని తమ కుమారుడికి ఆపాదిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. తాము అనుమానిస్తున్న వ్యక్తిపై పోలీసులు సరైన విచారణ జరపలేదని, అన్వేషణ నిమిత్తం ఫిన్లాండ్ వెళ్లేందుకు వీసాల మంజూరులో కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన మణిదీప్ రెడ్డి, లాహ్టిలోని లప్పీన్‌రాంటా-లాహ్టి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (లాఖు)లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. మే 5న కుటుంబ సభ్యులతో చివరిసారిగా మాట్లాడిన అతను, అనంతరం యూనివర్సిటీకి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న హెల్సింకి నగరానికి వెళ్లి అదృశ్యమయ్యాడు. అక్కడి ఒక షాపింగ్ మాల్‌లోని సీసీటీవీ ఫుటేజీలో అతను చివరిసారిగా కనిపించాడు. మణిదీప్ అదృశ్యంపై కేసు నమోదు కాగా, ఫిన్లాండ్ నేషనల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (NBI) దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో, బాధితుని ఆచూకీ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ కుటుంబ సభ్యులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో, ఈ మరణంపై సమగ్ర విచారణ జరిపించాలని మణిదీప్ కుటుంబం భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తోంది.

# ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు.. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు



- వాణిజ్య నౌకపై దాడికి ప్రతీకారంగానే చర్యలన్న అమెరికా
- హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన
- ఒప్పందాన్ని అమెరికానే ఉల్లంఘించిందన్న ఇరాన్
- పశ్చిమాసియాలో అత్యంత ప్రమాదకర స్థాయికి ఉద్రిక్తతలు

**ఇరాన్:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరాయి. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై ఇరాన్ దాడికి ప్రతీకారంగా, శనివారం తెల్లవారుజామున అమెరికా సైన్యం ఇరాన్‌పై మరోసారి భీకర దాడులు జరిపింది. వారం వ్యవధిలో ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగడం ఇది మూడోసారి కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన వివరాల ప్రకారం, శనివారం తెల్లవారు జామున 5:45 గంటలకు ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా బలగాలు దాడులు చేశాయి. అంతకుముందు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ), హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న 'ఎమ్/వి జిఎఫ్ఎస్ గెలాక్సీ' అనే వాణిజ్య నౌకపై దాడి చేసింది. ఈ ఘటనలో నౌక ఇంజిన్ రూమ్ తీవ్రంగా దెబ్బతిని మంటలు చెలరేగాయి. ఒక సిబ్బంది కూడా అదృశ్యమయ్యారు. వాణిజ్య నౌకలపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిపినట్లు సెంట్‌కామ్ స్పష్టం చేసింది. ఈ దాడులపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ "ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు దానికి తగిన మూల్యం చెల్లించుకుంటోంది" అని తీవ్రంగా హెచ్చరించారు.

### హర్మూజ్ జలసంధి మూసివేత

అమెరికా దాడులకు కొన్ని గంటల ముందే ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన వాణిజ్య రవాణా మార్గమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలో అమెరికా జోక్యం ఆగిపోయే వరకు ఏ అంతర్జాతీయ నౌకను అనుమతించేది లేదని ఐఆర్‌జీసీ నేవీ స్పష్టం చేసింది. దశాబ్దాలుగా ఇది అంతర్జాతీయ జలమార్గంగా ఉన్నప్పటికీ, తమ సార్వభౌమ ప్రాంతంగా పరిగణిస్తూ నౌకల నుంచి పన్నులు వసూలు చేస్తామని ఇరాన్ వాదిస్తోంది. అమెరికా దాడుల తర్వాత ఇరాన్‌లోని ఖేష్మ్ ద్వీపం, బందర్ అబ్బాస్, సిరిక్‌లలో భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

### తప్పంతా అమెరికాదేనన్న ఇరాన్

ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందిస్తూ, అమెరికానే తమ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇరాన్ చమురు అమ్ముకోవడానికి ఇచ్చిన మినహాయింపులను అమెరికా ఏకపక్షంగా రద్దు చేయడమే దీనికి కారణమన్నారు. అయితే, హర్మూజ్ జలసంధిలో ఇరాన్ దాడులకు పాల్పడటం వల్లే చమురు మినహాయింపులు రద్దు చేశామని అమెరికా వాదిస్తోంది. ఈ పరస్పర దాడులు, ఆరోపణలతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింతగా ముదిరింది.

# పంజాబ్ కాంగ్రెస్‌లో ముదిరిన సంక్షోభం.. పీసీసీ చీఫ్ మార్పుపై చన్నీ వర్గం పట్టు!

- పంజాబ్ కాంగ్రెస్‌లో తీవ్రమైన వర్గపోరు
- పీసీసీ చీఫ్ వారింగ్‌ను తొలగించాలని చన్నీ వర్గం పట్టు
- ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ బఘేల్‌తో అసమ్మతి నేతల రహస్య భేటీ
- 'స్లీపర్ సెల్స్' అంటూ సొంత నేతలపై వారింగ్ ఆరోపణలు
- ఎన్నికల ముందు అధిష్ఠానానికి పెరిగిన తలనొప్పి




**పంజాబ్:** 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా సిద్ధమవుతున్న పంజాబ్ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు తారస్థాయికి చేరాయి. పీసీసీ అధ్యక్షుడు అమ్రీందర్ సింగ్ రాజా వారింగ్‌ను పదవి నుంచి తొలగించాలంటూ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జీత్ సింగ్ చన్నీ వర్గం పట్టుబట్టడంతో పార్టీలో సంక్షోభం ముదిరింది. ఈ విషయంపై చర్చించేందుకు శనివారం ఏఐసీసీ పంజాబ్ ఇన్‌ఛార్జ్ భూపేష్ బఘేల్‌తో చన్నీ వర్గం నేతలు రహస్యంగా భేటీ అయ్యారు. అయితే, పీసీసీ చీఫ్ మార్పు విషయంలో ఎలాంటి హామీ లభించకపోవడంతో ఈ సమావేశం అసంపూర్తిగా ముగిసింది. చండీగఢ్‌లో సీనియర్ ఎమ్మెల్యే రాణా గుర్జీత్ సింగ్ నివాసంలో ఈ కీలక సమావేశం జరిగింది. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ భేటీలో చన్నీతో పాటు ప్రతిపక్ష నేత ప్రతాప్ సింగ్ బాజ్వా, మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌జీందర్ సింగ్ రంధావా సహా పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జులై 1న కాంగ్రెస్ అధిష్ఠానం రాజా వారింగ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిస్తూ, చన్నీని ప్రచార కమిటీ ఛైర్మన్‌గా నియమించింది. ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న చన్నీ వర్గం, వారింగ్‌ను తొలగించాల్సిందేనని బఘేల్ ముందు గట్టిగా డిమాండ్ చేసింది. సమావేశం అనంతరం భూపేష్ బఘేల్ మీడియాతో మాట్లాడుతూ.. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, నేతలు తమ అభిప్రాయాలను తెలిపారని, వాటిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అయితే, భేటీ నుంచి బయటకు వచ్చిన నేతలు మాత్రం తమ డిమాండ్‌పై స్పష్టంగా ఉన్నామని తేల్చిచెప్పారు. ముఖ్యంగా, మాజీ డిప్యూటీ సీఎం రంధావా మాట్లాడుతూ.. సీఎం భగవంత్ మాన్‌ను ఎదుర్కోవడానికి బలమైన నాయకత్వం కావాలని, తమకు 'రాజీపడే నాయకుడు' వద్దని పరోక్షంగా వారింగ్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విమర్శలపై రాజా వారింగ్ తీవ్రంగా స్పందించారు. "ఎవరా రాజీపడే నాయకుడు? నా పేరు చెప్పారా?" అని ప్రశ్నించారు. అంతేకాకుండా, పార్టీలోనే ఉంటూ కొందరు బీజేపీకి 'స్లీపర్ సెల్స్'గా పనిచేస్తున్నారని సొంత నేతలపైనే సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌ను వీడి వెళ్లిన పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు సునీల్ జాఖర్‌ను 'ద్రోహి' అని విమర్శించారు. చన్నీ వర్గానికి చెందిన దాదాపు 92 మంది కీలక నేతలు ఈ సమావేశానికి హాజరుకావడంతో, ఇది వారింగ్‌కు వ్యతిరేకంగా జరిగిన శక్తి ప్రదర్శనగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల ముందు మొదలైన ఈ వర్గపోరు అధిష్ఠానానికి పెద్ద తలనొప్పిగా మారింది.

# వైరల్ ఇన్ఫెక్షన్ల తర్వాత ఈ 5 లక్షణాలు కనిపిస్తే.. అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు!

- సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్లు కూడా గుండె సమస్యలకు దారితీసే అవకాశం
- ఛాతీ నొప్పి, ఆయాసం, వాపులు వంటివి కీలక హెచ్చరిక సంకేతాలు
- శరీరంలో తీవ్రమైన ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్ గుండెపై దాడి చేస్తుందన్న నిపుణులు
- ఫ్లూ కన్నా కోవిడ్ బాధితుల్లో గుండె జబ్బుల ముప్పు మూడు రెట్లు అధికం
- ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణుల సూచన

సీజనల్ ఫ్లూ, కోవిడ్-19 లేదా ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లు సోకినప్పుడు జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసం వంటి లక్షణాలు రావడం సర్వసాధారణం. విశ్రాంతి తీసుకుంటే కొద్ది రోజుల్లోనే కోలుకుంటామని చాలామంది భావిస్తారు. కానీ, కొన్ని సందర్భాల్లో వైరస్‌లు కేవలం శ్వాసకోశ వ్యవస్థకే పరిమితం కావు. వైరస్‌ను ఎదుర్కొనేందుకు శరీరం సృష్టించే తీవ్రమైన ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్ (వాపు ప్రక్రియ) ఒక్కోసారి గుండెపై దాడి చేసి, ప్రాణాంతక పరిస్థితులకు దారితీస్తుంది. ఈ మార్పును సకాలంలో గుర్తించడం చాలా ముఖ్యం.సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్ గుండె సమస్యగా మారినప్పుడు కనిపించే కీలక హెచ్చరిక సంకేతాల గురించి వైద్య నిపుణులు కీలక విషయాలు వెల్లడించారు. "వైరస్‌లు ఎప్పుడూ శ్వాసకోశ వ్యవస్థ లేదా జీర్ణాశయానికే పరిమితం కావు. కొన్నిసార్లు శరీరం యొక్క తీవ్రమైన రోగనిరోధక ప్రతిస్పందన హృదయనాళ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటుంది. ఇది మయోకార్డైటిస్ (గుండె కండరాల వాపు) లేదా పెరికార్డైటిస్ (గుండె బయటి పొర వాపు) వంటి ప్రమాదకరమైన పరిస్థితులకు దారి తీస్తుంది" అని అన్నారు.



## నిర్లక్ష్యం చేయకూడని 5 హెచ్చరిక సంకేతాలు

**1. శరీర భంగిమను బట్టి మారే ఛాతీ నొప్పి:** దగ్గినప్పుడు వచ్చే కండరాల నొప్పి వేరు, గుండె నొప్పి వేరు. ఛాతీలో బరువుగా నొక్కినట్లు లేదా పిండినట్లు అనిపిస్తే అది గుండె సంబంధిత నొప్పి కావచ్చు. "వెల్లకిలా పడుకున్నప్పుడు ఛాతీ నొప్పి పెరిగి, ముందుకు వంగినప్పుడు కొద్దిగా తగ్గితే, అది వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల కలిగే పెరికార్డైటిస్‌కు స్పష్టమైన సంకేతం" అని వైద్య నిపుణులు తెలిపారు.

**2.తీవ్రమైన ఆయాసం:** జలుబు, బ్రాంకైటిస్ వంటి సమస్యలతో బాధపడుతున్నప్పుడు ఆయాసంగా ఉండటం సాధారణమే. కానీ, బాత్రూమ్‌కు నడవడం లేదా కూర్చున్న చోట కూడా శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంటే, మీ గుండె రక్తాన్ని సమర్థవంతంగా పంప్ చేయలేకపోతోందని అర్థం. అర్ధరాత్రి హఠాత్తుగా ఊపిరాడక మెలకువ రావడం అత్యంత ప్రమాదకరమైన సంకేతం.

**3.వేగవంతమైన లేదా అస్థిరమైన హృదయ స్పందన:** జ్వరం ఉన్నప్పుడు శరీర జీవక్రియ పెరిగి గుండె వేగంగా కొట్టుకోవడం సహజం. కానీ, జ్వరం తగ్గిన తర్వాత కూడా గుండె దడదడలాడుతున్నా, వేగంగా కొట్టుకుంటున్నా అది అరిథ్మియా (అస్థిర హృదయ స్పందన)కు సంకేతం కావచ్చు.


**4.శరీరంలో వాపులు, బరువు పెరగడం:** వైరస్ కారణంగా గుండె బలహీనపడినప్పుడు, రక్తాన్ని సరిగా పంప్ చేయలేదు. దీంతో శరీరంలో ద్రవాలు పేరుకుపోతాయి. "చీలమండలు, పాదాలు లేదా కాళ్లలో అకస్మాత్తుగా వాపులు రావడం, సాక్సులు తీసినప్పుడు చర్మంపై లోతైన గుంటలు పడటం, 24 నుంచి 48 గంటల్లో హఠాత్తుగా బరువు పెరగడం వంటివి గుండెపై ఒత్తిడికి సంకేతాలు" అని హెచ్చరించారు.

**5.తీవ్రమైన నీరసం, కళ్లు తిరగడం:** వైరల్ ఇన్ఫెక్షన్ నుంచి కోలుకోవడానికి సమయం పడుతుంది, కానీ శక్తి స్థాయిలు క్రమంగా పెరగాలి. అలా కాకుండా, ఒకరోజు బాగానే ఉండి మరుసటి రోజు అకస్మాత్తుగా తీవ్రమైన నీరసం, కళ్లు తిరగడం లేదా స్పృహ తప్పడం వంటివి జరిగితే, అది గుండె పనితీరు మందగించడం వల్ల రక్తపోటు పడిపోవడానికి సూచన కావచ్చు.

## శాస్త్రీయ ఆధారాలు ఏం చెబుతున్నాయి?

వైరస్‌ల వల్ల గుండెకు నష్టం వాటిల్లుతుందనడానికి బలమైన శాస్త్రీయ ఆధారాలున్నాయి. 'ఓపెన్ హార్ట్ జర్నల్'లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. ఫ్లూతో పోలిస్తే కోవిడ్-19 బారిన పడిన వారిలో మయోకార్డైటిస్ ముప్పు మూడు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే వాపు ప్రక్రియను ముందుగానే గుర్తిస్తే, దీర్ఘకాలిక నష్టాన్ని, హార్ట్ ఫెయిల్యూర్‌ను నివారించవచ్చని 'కరెంట్ ప్రాబ్లమ్స్ ఇన్ కార్డియాలజీ జర్నల్'లో ప్రచురించిన మరో విశ్లేషణ నొక్కి చెప్పింది. "ఇది మామూలు ఫ్లూ లక్షణమే కదా అని ఈ సంకేతాలను అస్సలు నిర్లక్ష్యం చేయవద్దు. వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల గుండెకు కలిగే సమస్యలను ముందుగానే గుర్తిస్తే, శాశ్వత నష్టం జరగకుండా నివారించవచ్చు" అని వైద్య నిపుణులు సూచించారు.

# వైభవ్ సూర్యవంశీపై వేటు.. గంభీర్ నిర్ణయంపై సునీల్ గవాస్కర్ తీవ్ర ఆగ్రహం!






- ఇంగ్లాండ్‌తో చివరి టీ20లో వైభవ్ స్థానంలో తిరిగి జట్టులోకి సంజూ శాంసన్
- టీమిండియా మేనేజ్‌మెంట్‌పై సునీల్ గవాస్కర్ తీవ్ర ఆగ్రహం
- ఇది చాలా కఠినమైన నిర్ణయమంటూ గంభీర్‌ను తప్పుబట్టిన గవాస్కర్
- వైభవ్‌కు అండగా నిలిచిన ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్

ఇంగ్లాండ్‌తో జరిగిన చివరిదైన ఐదో టీ20 మ్యాచ్‌లో భారత తుది జట్టు ఎంపిక వివాదానికి దారితీసింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని పక్కనపెట్టి, ఫామ్‌లో లేని సంజూ శాంసన్‌ను తిరిగి జట్టులోకి తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్, ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్.. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. సిరీస్ ఫలితం ఇప్పటికే తేలిపోయిన నేపథ్యంలో, ఈ నామమాత్రపు మ్యాచ్‌లో యువ ఆటగాడిని పక్కనపెట్టడంపై సునీల్ గవాస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "వైభవ్‌ను తీసుకోకపోవడం నన్ను చాలా నిరాశపరిచింది. ఇది తప్పక గెలవాల్సిన మ్యాచ్ అయితే, అనుభవం ఉన్న ఆటగాడిని ఆడించడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ ఎలాంటి ప్రాధాన్యం లేని మ్యాచ్‌లో ఒక యువ ప్రతిభావంతుడికి అవకాశం ఇవ్వకపోవడం పెద్ద తప్పు. ఎవరో ఒకరు ఆ పిల్లాడి భుజంపై చేయి వేసి ధైర్యం చెప్పాలి. కేవలం మూడు మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా 15 ఏళ్ల బాలుడిని జట్టు నుంచి తొలగించడం చాలా కఠినమైన నిర్ణయం" అని గవాస్కర్ వ్యాఖ్యానించాడు.మరోవైపు, ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ కూడా భారత యాజమాన్యంపై విమర్శలు గుప్పించాడు. "వైభవ్‌ను భవిష్యత్ సూపర్ స్టార్ అని నమ్మినప్పుడు, అతడికి కేవలం మూడు మ్యాచ్‌లు ఇచ్చి ఎలా వదిలేస్తారు? ఆడిన మూడు మ్యాచ్‌ల్లో అతడు తన సత్తా చూపిం చాడు. ఫామ్ లేక 5, 0, 1 పరుగులు చేసిన శాంసన్‌ను మళ్ళీ తెచ్చారు. అతడి కంటే 13, 14, 15 పరుగులు చేసిన ఈ పిల్లాడే బెటర్‌గా ఆడాడు" అని స్వాన్ అన్నాడు.ఈ సిరీస్‌లో వైభవ్ మూడు మ్యాచ్‌ల్లో 42 పరుగులు చేశాడు. ఇంగ్లాండ్ పేసర్ల బౌన్స్‌ను ఎదుర్కోవడంలో కాస్త తడబడినప్పటికీ, వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. 15 ఏళ్ల వయసులో ఉన్న ఒక ఆట గాడిని ఇలా హఠాత్తుగా తొలగించడం అతడి ఆత్మవి శ్వాసాన్ని దెబ్బతీస్తుందని, జట్టు పేలవ ప్రదర్శనకు ఆ కుర్రాడిని బలిపశువును చేయకూడదని స్వాన్ హితవు పలికాడు.



# హైదరాబాద్, విజయవాడలో నేటి బంగారం, వెండి ధరలివే!

- తెలుగు రాష్ట్రాల్లో నిలకడగా కొనసాగుతున్న బంగారం ధరలు
- హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,330
- 10 గ్రాముల 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,32,300
- కిలో వెండి ధర రూ.2,40,000 వద్ద స్థిరంగా

హైదరాబాద్, (సింధూర దర్శిని) 12 జులై :బంగారం ధరలు ఆదివారం స్థిరంగా కొనసాగాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పసిడికి డిమాండ్ తగ్గకపోవడంతో ధరల్లో పెద్దగా మార్పులు చోటుచేసుకోలేదు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలలో ధరలు యథాతథంగా ఉన్నాయి.ఆదివారం ఉదయం నాటి మార్కెట్ సమాచారం ప్రకారం, హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,330గా నమోదైంది. అదేవిధంగా, 10 గ్రాముల 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,08,250గా ఉంది. పసిడి బాటలోనే వెండి ధరలు కూడా స్థిరంగా ఉన్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,40,000 వద్ద కొనసాగుతోంది.తెలంగాణలోని నిజామాబాద్, ఖమ్మం, వరంగల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి నగరాల్లోనూ ఇవే ధరలు అమలవుతున్నాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే చెన్నైలో పసిడి ధర కాస్త ఎక్కువగా ఉంది. అక్కడ 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,45,090గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,44,480గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో హైదరాబాద్‌తో సమానమైన ధరలే ఉన్నాయి. కొనుగోలుదారులు లావాదేవీలకు ముందు అధీకృత డీలర్ల వద్ద ప్రస్తుత ధరలను సరిచూసుకోవడం ఉత్తమం.

# బీజేపీ చరిత్రలో ఇదే తొలిసారి.. అభ్యర్థి భయపడి పారిపోయాడు: ప్రశాంత్ కిశోర్

- బంకీపూర్ ఉపఎన్నిక నుంచి తప్పుకున్న బీజేపీ అభ్యర్థి
- భయంతోనే బీజేపీ అభ్యర్థి పారిపోయాడన్న ప్రశాంత్ కిశోర్
- బీజేపీ చరిత్రలోనే ఇది అపూర్వ ఘటన అని పీకే విమర్శ
- సీఎం సమ్రాట్ చౌదరిపై కూడా పీకే ఘాటు వ్యాఖ్యలు
- బీజేపీ కంచుకోటలో పీకే పోటీతో ఆసక్తికరంగా మారిన పోరు



**బంకీపూర్:** బీహార్ రాజకీయాల్లో జన సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ చరిత్రలోనే ఇది అపూర్వమైన ఘట్టమని, ఓటమి భయంతోనే వారి అభ్యర్థి బరి నుంచి పారిపోయాడని ఆరోపించారు. ఇదే స్థానం నుంచి పీకే స్వయంగా పోటీ చేస్తుండటంతో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.బంకీపూర్ ఉపఎన్నిక కోసం బీజేపీ తొలుత భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అభిషేక్ కుమార్ సిన్హాను తమ అభ్యర్థిగా ప్రకటించింది. అయితే, నామినేషన్ దాఖలు చేసిన మరుసటి రోజే ఆయన 'కుటుంబ కారణాల'తో పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీంతో వెంటనే స్పందించిన బీజేపీ అధిష్ఠానం, యువ జన విభాగం నేత నీరజ్ కుమార్ సిన్హాను కొత్త అభ్యర్థి గా బరిలోకి దించింది. ఈ నియోజకవర్గానికి జులై 30న పోలింగ్ జరగనుండగా, ఆగస్టు 3న ఫలితాలు వెలువడనున్నాయి.ఈ పరిణామంపై ప్రశాంత్ కిశోర్ విలేకరులతో మాట్లాడుతూ "ఇప్పటిదాకా దేశంలో బీజేపీ ఒత్తిడికో, భయానికో గురై ఇతర పార్టీల అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకోవడం చూశాం. కానీ, చరిత్రలో మొదటి సారిగా బీజేపీ అభ్యర్థే భయపడి ఎన్నికల బరి నుంచి పారిపోయాడు. ఇది ప్రజాస్వామ్య బలానికి, ప్రజల నమ్మకానికి నిదర్శనం" అని వ్యాఖ్యానించారు. ప్రజలు ఇప్పుడు మార్పును కోరుకుంటున్నారని, బీజేపీకి వారి సొంత కోటలోనే గుణపాఠం చెప్పడానికి సిద్ధమయ్యారని పీకే అన్నారు.అంతటితో ఆగకుండా, బీహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరిపై కూడా పీకే తీవ్ర విమర్శలు చేశారు. "ఆయన ప్రవర్తన, క్యారెక్టర్, ప్రజల్లో ఉన్న ఇమేజ్ చూస్తే బీహార్ ప్రజలు ఆయనను సీఎంగా అంగీకరించే ప్రసక్తే లేదు. ముఖ్యమంత్రి ఏ వర్గం నుంచైనా రావచ్చు, అది సమస్య కాదు. కానీ సమర్థుడైన, అర్హుడైన వ్యక్తిని ఎన్నుకోవడమే ముఖ్యం" అని స్పష్టం చేశారు.కాగా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకీపూర్ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. గత ఐదు పర్యాయాలుగా నితిన్ నబీన్ ఇక్కడి నుంచి వరుసగా విజయం సాధిస్తుండటంతో ఇది బీజేపీకి కంచుకోటగా పేరుగాంచింది. అయితే, ఈసారి ప్రశాంత్ కిశోర్ నేరుగా బరిలోకి దిగడంతో ఈ ఉపఎన్నిక పోరు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. బీజేపీ కొత్త అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హా సోమవారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు.

# ప్రశ్నించే గొంతులమీద తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్ళకి నా సమాధానం ఇదే: ప్రకాశ్ రాజ్



**బెంగుళూరు:** ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తనపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై తీవ్రస్థాయిలో, వ్యంగ్యంగా స్పందించారు. 'దిగజారండి' అంటూ విమర్శకులను ఉద్దేశించి ఓ వీడియో పోస్ట్ చేశారు. తాను మౌనంగా లేనని, అన్నీ గమనిస్తున్నానని చెబుతూ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "నేను మౌనంగా లేను. అన్నీ చూస్తున్నా. ఎమ్మెల్యేలు, ఎంపీలు, వాళ్ల పలుకుబడితో జనసైనికులు, కొందరికి అమ్ముడుపోయిన చానళ్లు, యూట్యూబర్లు... సోషల్ మీడియాలో మీ అబద్ధాలు, మీరు అల్లుతున్న కట్టుకథలు, మీ బూతులు అన్నీ వింటున్నా. మీ అందరికీ నా సమాధానం ఒక్కటే.. దిగజారండి... దిగజారండి... దిగజారుతూనే ఉండండి. ఇది మీ దిగజారుడుతనానికి ఆరంభం మాత్రమే. మొత్తం ప్రపంచం మీ దిగజారుడుతనాన్ని చూస్తోంది. అయితే, దిగజారడం అనే సామర్థ్యంపై మీకున్న నమ్మకాన్ని మాత్రం దిగజారనివ్వకండి. కాస్త గట్టిగా దిగజారండి... అరుస్తూ దిగజారండి... అంటూ తన వీడియోను ముగించారు.

# సినిమా న్యూస్

## 100 కోట్ల క్లబ్‌లో 'మా ఇంటి బంగారం'



- రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన 'మా ఇంటి బంగారం'
- ఈ ఘనత సాధించిన తొలి తెలుగు మహిళా ప్రధాన చిత్రం
- నటిగా, నిర్మాతగా సమంతకు అరుదైన గౌరవం
- దర్శకురాలు నందిని రెడ్డితో మరో బ్లాక్‌బస్టర్
- భవిష్యత్ మహిళా చిత్రాలకు స్ఫూర్తిగా మారిన విజయం

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు నటించిన 'మా ఇంటి బంగారం' తెలుగు చిత్ర పరిశ్రమలో సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన 24 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను అధిగమించి, టాలీవుడ్‌లో ఈ మైలురాయిని చేరుకున్న తొలి లేడీ ఓరియెంటెడ్ చిత్రంగా అరుదైన రికార్డును నెలకొల్పింది. ఈ చారిత్రాత్మక విజయంతో సమంత తన స్టార్‌డమ్‌ను, మార్కెట్ స్టామినాను మరోసారి బలంగా నిరూపించుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ చరిత్రలో ఒక కథానాయిక ప్రధాన పాత్ర పోషించిన సినిమా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరడం ఇదే తొలిసారి. ఇప్పటివరకు ఈ ఘనత కేవలం అగ్ర హీరోల చిత్రాలకే పరిమితం కాగా, సమంత ఆ ముద్రను చెరిపివేశారు. తన అద్భుతమైన నటనతో, బాక్సాఫీస్ వద్ద తనకున్న బలమైన పట్టుతో ఒక సినిమాను ఏ స్థాయికి తీసుకెళ్లగలరో ఆమె నిరూపించారు. ఈ విజయం సమంత కెరీర్‌లోనే కాకుండా, తెలుగు సినిమా చరిత్రలోనే ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోనుంది. ఈ చిత్రానికి ప్రతిభావంతురాలైన నందిని రెడ్డి దర్శకత్వం వహించారు. గతంలో సమంత, నందిని రెడ్డి కాంబినేషన్‌లో వచ్చిన "ఓ బేబీ" చిత్రం ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు "మా ఇంటి బంగారం"తో ఈ విజయవంతమైన జోడీ మరోసారి తమ మ్యాజిక్‌ను పునరావృతం చేసింది. సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించడం మరో విశేషం. నిర్మాతగా ఆమె తొలి ప్రయత్నమే ఇంతటి భారీ విజయాన్ని అందుకోవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రముఖ దర్శక ద్వయం రాజ్ నిడిమోరు ఈ చిత్రానికి క్రియేటర్‌గా వ్యవహరించగా, సంతోష్ నారాయణన్ అందించిన సంగీతం సినిమా విజయంలో కీలక పాత్ర పోషించింది. విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకుపోయిన "మా ఇంటి బంగారం", ప్రేక్షకుల మద్దతుతో నిలకడగా వసూళ్లు రాబట్టింది. ఈ విజయం భవిష్యత్తులో రాబోయే మహిళా-ప్రధాన చిత్రాలకు ఒక స్ఫూర్తిగా నిలవడమే కాకుండా, వాటిపై అంచనాలను భారీగా పెంచేసింది. ఇకపై ఇలాంటి కథాంశాలతో వచ్చే చిత్రాలు విజయం సాధించాలంటే, "మా ఇంటి బంగారం" సృష్టించిన బెంచ్‌మార్క్‌ను అందుకోవాల్సిన సవాలు ముందుంది. ఈ చారిత్రాత్మక విజయంతో సమంత టాలీవుడ్‌లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు.

## రెండు రోజుల్లో రికార్డు వసూళ్లు... దూసుకుపోతున్న అఖిల్ 'లెనిన్'

బాక్సాఫీస్ వద్ద 'లెనిన్'కు కలెక్షన్ల సునామీ
రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 37.2 కోట్ల గ్రాస్
పాజిటివ్ మౌత్ టాక్‌తో భారీగా పెరుగుతున్న వసూళ్లు
చాలా కాలం తర్వాత అఖిల్‌కు సాలిడ్ కమర్షియల్ హిట్

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 37.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో అఖిల్ ఊరమాస్ నటనకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.మంచి మౌత్ టాక్ రావడంతో సినిమా వసూళ్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. "ప్రేక్షకుల మౌత్ టాక్ అద్భుతంగా పనిచేస్తోంది. రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 37.2 కోట్ల గ్రాస్ సాధించి 'లెనిన్' దూసుకుపోతోంది" అంటూ నిర్మాణ సంస్థ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. చాలా కాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్‌కు ఈ సినిమా రూపంలో అది లభించడంతో అక్కినేని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో పాటు అన్నపూర్ణ స్టూడియోస్, మనం ఎంటర్‌ప్రైజెస్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించాయి. ఎస్ఎస్ తమన్ అందించిన నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచిందని ప్రేక్షకులు చెబుతున్నారు. వీకెండ్ ముగిసే నాటికి ఈ వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



## తమిళ హీరో ఆర్యపై హైదరాబాద్‌లో చీటింగ్ కేసు.. రూ.1.80 కోట్ల బకాయిల వివాదం

- హైదరాబాద్‌కు చెందిన టెక్నిక్ సంస్థ ఫిర్యాదుతో కేసు
- మలయాళ చిత్రం 'అనంతన్ కాడు' షూటింగ్ కోసం పరికరాల వినియోగం
- డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో ఆరోపణ



ప్రముఖ తమిళ నటుడు ఆర్య (జంషెడ్ సి)తో పాటు ఆయన నటించిన మలయాళ చిత్రం 'అనంతన్ కాడు' నిర్మాతలపై హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మోసం (చీటింగ్) కేసు నమోదైంది. సినిమా షూటింగ్ నిమిత్తం వినియోగించిన పరికరాల అద్దె బకాయిలు రూ. 1.80 కోట్లకు పైగా చెల్లించలేదని ఆరోపిస్తూ బాధితులు పోలీసులను ఆశ్రయించారు. హైదరాబాద్‌కు చెందిన 'తాహెర్ సినీ టెక్నిక్' సంస్థ అకౌంటెంట్ జావేద్ అలీ ఈ మేరకు ఫిర్యాదు చేశారు. 'అనంతన్ కాడు' సినిమా చిత్రీకరణ కోసం 2025 ఫిబ్రవరిలో నటుడు ఆర్య, నిర్మాత వినోద్ తమ సంస్థను సంప్రదించినట్లు ఆయన పేర్కొన్నారు. తమ సంస్థకు చెందిన ఖరీదైన కెమెరాలు, లైటింగ్ యూనిట్లను హైదరాబాద్ నుంచి కేరళకు తరలించామని, అయితే షూటింగ్ పూర్తయిన తర్వాత చెల్లించాల్సిన మొత్తం రూ. 2.12 కోట్ల అద్దెలో మెజారిటీ వాటాను ఎగవేసినట్లు వివరించారు. బకాయిలు చెల్లిస్తామని పలుమార్లు హామీ ఇచ్చి, ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని బాధితులు ఫిర్యాదులో వెల్లడించారు. వాట్సాప్, ఫోన్ కాల్స్ ద్వారా సంప్రదించినా స్పందన లేదని, పైగా బాకీ డబ్బుల గురించి అడిగిన తమ మేనేజర్‌ను నిర్మాతతో పాటు ఆర్య, ఆయన వ్యక్తిగత సహాయకుడు కిషోర్ బెదిరించారని ఆరోపించారు. వాస్తవాలను కప్పిపుచ్చి కేరళలోని న్యాయస్థానం నుంచి వీరు మధ్యంతర ఉత్తర్వులు కూడా పొందారని వారు తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జూబ్లీహిల్స్ పోలీసులు శనివారం వెల్లడించారు.

## ముంబైలో క్రిస్టోఫర్ నోలన్.. స్థానిక కేఫ్‌లో చాయ్ తాగిన 'ది ఒడిస్సీ' టీమ్..

ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తన సరికొత్త చిత్రం 'ది ఒడిస్సీ' ప్రమోషన్స్ కోసం ఇండియాలో అడుగుపెట్టారు. నిన్న ముంబైలో జరిగిన ఈ సినిమా స్పెషల్ ప్రీమియర్‌కు ఆయనతో పాటు నటులు మ్యాట్ డామన్, టామ్ హాలండ్ హాజరయ్యారు. అయితే, ఈ గ్రాండ్ ఈవెంట్‌కు ముందు వీరు ముగ్గురూ ముంబైలోని ఒక కేఫ్‌లో ఆగి, సరదాగా చాయ్ తాగుతూ కనిపించడం ఆసక్తికరం గా మారింది. ఈ పర్యటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోను యూనివర్సల్ పిక్చర్స్ ఇండియా తమ సోషల్ మీడియాలో పంచుకుంది. "ది ఒడిస్సీ ముంబై ప్రీమియర్‌కు ముందు చిన్న టీ స్టాప్. పెద్ద రాత్రి ఎదురు చూస్తోంది. కానీ, చాయ్ మొదట!" అనే క్యాప్షన్‌తో ఈ ఫొటోలను పోస్ట్ చేసింది. ఇందులో నోలన్, డామన్, హాలండ్ చాయ్‌తో పాటు బన్ మస్కా, కొన్ని డెజర్ట్‌లను ఆస్వాదిస్తున్నట్లు కనిపించారు.




## సూపర్ స్టార్ కృష్ణ 'సింహాసనం' హీరోయిన్ ఇప్పుడెలా ఉందో చూశారా?

- సూపర్ స్టార్ కృష్ణ 'సింహాసనం' హీరోయిన్ మందాకిని లేటెస్ట్ ఫోటోలు
- ప్రస్తుతం మనాలిలో పర్యటిస్తూ సోషల్ మీడియాలో పంచుకున్న నటి
- హిమాచలీ సంప్రదాయ దుస్తుల్లో పర్వతాల మధ్య ప్రశాంతంగా కనిపిస్తున్న మందాకిని
- ప్రకృతి ఒడిలో దొరికే ఆనందంపై భావోద్వేగ పోస్ట్ షేర్ చేసిన వైనం
- తెలుగులో కృష్ణ, బాలకృష్ణ సరసన నటించిన మందాకిని



ఒకప్పుడు వెండితెరపై ఓ సంచలనం.. అందం, అభినయంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసిన తార. ఆమె పేరు చెప్పగానే చాలా మందికి 'రామ్ తేరి గంగా మైలీ' సినిమానే గుర్తుకొస్తుంది. కానీ, తెలుగు ప్రేక్షకులకు మాత్రం ఆమె సూపర్ స్టార్ కృష్ణ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'సింహాసనం' కథానాయిక. ఆ చిత్రంలో 'విషకన్య' పాత్రలో కృష్ణ పక్కన ఆమె అభినయం ఇప్పటికీ చాలా మందికి గుర్తుండే ఉంటుంది. ఆ తారే మందాకిని. మరి ఇన్నేళ్ల తర్వాత ఆమె ఇప్పుడెక్కడున్నారు? ఏం చేస్తున్నారు? అనే ఆసక్తి చాలా మందిలో ఉంటుంది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న కొన్ని ఫోటోలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ప్రస్తుతం మందాకిని మనాలి పర్యటనలో ఉన్నారు. అక్కడి ప్రశాంతమైన వాతావరణాన్ని, పర్వతాల అందాలను ఆస్వాదిస్తున్నారు. ఈ సందర్భంగా హిమాచల్ ప్రదేశ్ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా, అక్కడి సంప్రదాయ దుస్తులు ధరించి దిగిన ఫోటోలను ఆమె పంచుకున్నారు. వీపుపై పూలతో అలంకరించిన సంప్రదాయ బుట్ట (టోక్రీ)తో, పర్వతాల నడుమ ప్రశాంత వదనంతో ఆమె కనిపించారు. ఈ ఫోటోలు చూస్తుంటే కాలం గడిచినా ఆమెలోని ఆకర్షణ ఏమాత్రం తగ్గలేదనిపిస్తుంది. ఈ ఫోటోలతో పాటు ప్రకృతి ఒడిలో లభించే ఆనందం గురించి ఆమె ఒక భావోద్వేగభరితమైన నోట్ రాశారు. "కొండలకు మాత్రమే తెలిసిన ఒక ప్రత్యేకమైన ఆనందం ఉంటుంది. పైన్ చెట్ల గుసగుసలు, చల్లని గాలి స్పర్శ, ప్రకృతిలోని శాశ్వతమైన అందం ఆ ప్రశాంతతను మోసుకొస్తాయి. మనాలిలో ప్రతి సూర్యోదయం ఒక ఆశీర్వాదంలా, ప్రతి దారి ఒక కథలా అనిపిస్తుంది. కొన్ని ప్రయాణాలు మనల్ని అందమైన ప్రదేశాలకు తీసుకెళ్లడమే కాదు, మనల్ని మనకు తిరిగి పరిచయం చేస్తాయి. ఇక్కడి ప్రతి దృశ్యం నా హృదయాన్ని కృతజ్ఞతతో నింపేస్తుంది. స్వచ్ఛమైన గాలి శాంతినిస్తుంది" అని ఆమె తన అనుభూతిని పంచుకున్నారు. మందాకిని తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే. 1986లో వచ్చిన 'సింహాసనం' బ్లాక్ బస్టర్ హిట్టవ్వడంతో ఆమె ఇక్కడ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత నందమూరి బాలకృష్ణ సరసన 'భార్గవరాముడు' చిత్రంలోనూ ఆమె నటించారు. హిందీలో రాజ్ కపూర్ 'రామ్ తేరి గంగా మైలీ'తో ఆమె కెరీర్ శిఖర స్థాయికి చేరింది. ఆ తర్వాత 'డాన్స్ డాన్స్', 'కమాండో', 'జీతే హై షాన్ సే' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ప్రస్తుతం సినిమాలకు దూరంగా, ఇలా ప్రకృతి ఒడిలో ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతూ అభిమానులకు అప్పుడప్పుడు పలకరిస్తున్నారు.



Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662